# మోక్షం అంటే ?

రచన : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



# మోక్షం అంటే ?




**రచన & ప్రచురణ: బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు, B.Sc.,**



మొదటి ముద్రణ : మార్చి, 2026

ప్రతులు : 2,000

**వెల : రూ. 70/-**

**పుస్తకములు కొరకు :-**

**తటవర్తి వీరరాఘవరావు,**

**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.**

**సెల్ : 94901 71853, 9440309812**

# విషయ సూచిక

1) మోక్షం అంటే ఏమిటి? ........................................................................ 3

2) చావు పుట్టుకల నుండి తప్పించుకోవడమే మోక్షము ........................ 7

3) "శాశ్వతంగా దుఃఖం నుంచి బయట పడడమే మోక్షం" .................. 11

4) "శాశ్వత ఆనంద స్థితిని పొందడమే మోక్షం." ............................. 14

5) "స్వ స్వరూపమగు దైవ స్థితి కలిగి ఉండుటయే మోక్షము" .............. 19

6) "దేహ వ్యామోహాన్ని, మనోవ్యామోహాన్ని
వదిలించుకోవడమే మోక్షము." ................................................ 26

7) "కర్మ బంధము నుండి బయట పడడమే మోక్షము" ...................... 30

8) "అవిచ్ఛిన్న ఆత్మానందానుభూతిని పొందుటయే మోక్షము" ........... 37

9) "జనన మరణ చక్రం నుండి బయట పడడమే మోక్షం" ................... 40

10)"మానవుని లక్ష్యమైన పూర్ణాత్మగా ఎదగడమే మోక్షం" .................. 44

11) "మానవుని గమ్యమైన సత్యలోకం చేరుకోవడమే మోక్షం" ........... 50

12) "జన్మ రాహిత్యమే మోక్షం" ...................................................... 57

13) "మోహక్షయమే మోక్షం" ........................................................... 63

తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మిగార్ల పుస్తకములు
వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు
ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|

# మోక్షం అంటే ఏమిటి?

::1::

చాలా మందికి మోక్షమంటే ఏమిటి? అనే అవగాహన లేదు. మోక్షాన్ని సంపాదిస్తే వచ్చే లాభం ఏమిటి? మనలో కలిగే మార్పు ఏమిటి? అసలు మోక్షం ఎలా వస్తుంది? అనే అవగాహన లేదు. నిజంగా మోక్షమంటే సరైన అవగాహన కలిగి ఉంటే మీరు ప్రతిరోజు ధ్యానం చేయడం మానరు, అలాగే ప్రతి నెలా భీమవరం రావడం మానరు.

"మోక్షమంటే విడుదల అంటే బంధాలనుండి విడుదల, దుఃఖ భూయిష్టమైన సంసార బంధం నుండి విముక్తి పొందటమే మోక్షము".

ఉదాహరణకు మీరు గమనిస్తే నేరం చేసినవాడు జైల్లో నేరస్తుడిగా బందీ అయి ఉంటాడు. అలా బందీగా ఉన్నవాడు స్వేచ్ఛగా బయటకు వెళ్ళడానికి కానీ, బయట తిరగటానికి కాని, వీలు లేకుండా జైలులోనే ఉండాల్సి వస్తుంది. వారికి సంసార సుఖాలు అనుభవించటం, కుటుంబ సభ్యులతో సరదాగా గడపటం, కావాలనుకున్నవి తినటానికి, సినిమాలు, షికార్లు చేసే అవకాశం, హాలిడేస్ లో ఎంజాయ్ చేయడానికి యోగ్యత ఉండదు. వారందరూ నేరస్థులుగా బందీ అయి ఉన్నారు కాబట్టి అటువంటి అవకాశాలు వారికి ఉండవు.

మీరు గమనిస్తే వారిలాగానే భూమ్మీద మీరందరూ కూడా బందీలే. వారు జైల్లో బందీలు అయితే మీరు భూమి మీద బందీలు. మానవుడు ఏర్పాటు చేసిన జెల్లో నేరస్తులు బందీలు అయితే, భగవంతుడు ఏర్పాటు చేసిన ఈ భూమండలం అనే జైల్లో కర్మలు చేసిన వారందరూ బందీలే.

జైల్లో ఉన్న నేరస్తులకు అనేక సమస్యలు, బాధలు, గొడవలు, అశాంతి అనేవి ఉంటాయి. అలానే భూమి మీద నివసించే అందరికి అన్ని రకాల బాధలు, సమస్యలు ఉంటాయి. కొంతమంది ఏమనుకుంటారంటే నేరం చేసి

జైలుకు వెళ్తే శుభ్రంగా మూడు పూటలా వాళ్ళే తిండి పెడతారు, హాయిగా తిని ఉండొచ్చు అని అనుకుంటారు. కానీ అక్కడ ఎన్నో పోలిటిక్స్ ఉంటాయి, ఒకడు మీద ఒకడు డామినేట్ చేసుకోవడం, ఒకరితో ఒకరు గొడవలు పడటం చేస్తుంటారు. అక్కడ ఉన్నంత కాలం వారు ఎంతో నరకాన్ని అనుభవిస్తుంటారు.

మన సమాజంలో కొన్ని కుటుంబాలలో భార్యలకు ఇల్లే ఒక జైలు, వారికీ ఎటువంటి  స్వేచ్ఛా స్వాతంత్రాలు ఉండవు. భర్త ఏది చెప్తే దాన్ని బట్టి నడచుకోవాల్సి వస్తుంది, లేకుంటే భర్త నుండి దండన తప్పదు. జైల్లో ఏదైనా తప్పు చేస్తే అక్కడ ఉన్న గార్డు దండన ఎలా విధిస్తాడో,  అలాగే ఈ భూలోకం అనే జైల్లో ఆ భర్తతో అలాంటి దండనే ఉంటుంది. ఇంకా స్కూల్ లో చదువుకునే పిల్లలు డిసిప్లిన్ తప్పితే టీచర్ దగ్గర నుండి దండన ఉంటుంది.

జైల్లో నేరం చేసినవారు నేరస్థులుగా ఎలా ఉంటారో! అలానే ఈ భూమ్మీద కర్మలు చేసినవారు జీవిస్తుంటారు. మానవుడు ఈ భూమ్మీద కొన్ని జన్మలు తీసుకునే సరికి ఇక్కడ పడే బాధలు, దుఃఖం, ఇక్కడ ఉండే సమస్యలు, ఇక్కడ ఉండే గొడవలు అన్నీ అనుభవించి ఇందులో నుంచి ఎలా అయినా బయటపడాలి? అంటే విడుదల అవ్వాలి? అని అనుకుంటాడు. ఈ భూమ్మీద కర్మలు అనుభవించే మానవుడు ఈ బంధాల నుంచి విముక్తుడు అవ్వాలని అనుకుంటాడు.

అలా బంధాలనుండి బయటపడటం అంటే విడుదల అవటాన్ని మోక్షము అంటారు. జైల్లో ఉన్న నేరస్థుడు రోజులు లెక్కపెట్టుకుంటూ జైలు నుంచి విడుదల కోసం ఎలా ఎదురు చూస్తాడో! ఈ భూమ్మీద మానవుడు బంధాలు, బాధ్యతల నుండి విడుదలై మోక్షం పొందటం కొసం ఎదురు చూస్తూ ఉంటాడు.

జైలులో ఉన్న నేరస్థుడు వాడికి పడిన శిక్ష అంటే ఎన్ని రోజులైనా, ఎన్ని నెలలైనా, ఎన్ని సంవత్సరాలైనా అంతకాలం ఆ శిక్షని వాడు అనుభవించ

వలసిందే, అలానే ఈ భూమ్మీద మానవుడు చేసిన ప్రతి కర్మ అనుభవించే వరకు మోక్షాన్ని పొందలేడు. కానీ మనమందరం మోక్షాన్ని పొందే ప్రయత్నంలోనే ఉన్నాము, బంధ విముక్తులు కావాలనే ప్రయత్నంలోనే ఉన్నాము.

ఈ సంసారం అనేది దుఃఖభూయిష్టమైనది. మీరు ప్రతిరోజు తింటున్నారు, నిద్రిస్తున్నారు. కానీ ఎప్పుడు దుఃఖం, అశాంతి వుంటుంది. ఇలా ప్రతి ఒక్కరూ సంసార బంధాలలో చిక్కుకుని వున్నారు. సంసార బంధం అంటే పిల్లల బాధ్యతల కోసం జీవితమంతా ఒక యంత్రంలా పని చేయాల్సి వస్తుంది. ఉదయం నుండి ఉరుకులు పరుగులతో జీవిస్తూ ఉంటారు. పురుషులు అయితే ఉదయాన్నే లేచి పనులన్నీ చూసుకొని ఆఫీస్‌కి వెళ్ళి రోజంతా పనిచేసి సాయంత్రం ఇంటికి రావడం, మరలా ప్రొద్దున్నే నిద్ర లేవటం పనులన్నీ చూసుకొని మళ్లీ ఆఫీస్‌కి వెళ్ళి అక్కడ రోజంతా పనిచేయడం ఇలా నిరంతరం యంత్రంలా జీవిస్తూ ఉంటారు. మానవుడు జీవించి ఉన్నంత కాలం ఖాళీ లేకుండా యంత్రంలా పనిచేస్తూనే ఉన్నాడు.

మనలో చాలా మందికి అమెరికా వెళ్ళి అక్కడ బాగా సంపాదించాలి అని అనుకుంటారు. ఇక్కడి  లాగే త్రీ డేస్ ధ్యానం క్లాసులు అక్కడ ఏర్పాటు చేసి అక్కడున్న వాళ్ళని క్లాస్‌లకు రమ్మంటే, వాళ్ళు ఏమంటారు అంటే మాకసలు కుదరదు, మూడు రోజులు క్లాసు రావాలంటే మేము రాలేము అంటారు. మీరు గమనిస్తే వారందరూ యంత్రాల్లానే పనిచేస్తున్నారు అని అర్థం చేసుకోవచ్చు.

భీమవరం క్లాసులకు రమ్మంటే కొంతమంది మాకు సెలవులు దొరకలేదు అంటారు. కానీ మీరు గమనించండి సడన్ గా మీరు సిక్ ఐతే హాస్పిటల్ లో జాయిన్ అవ్వాల్సివస్తే తప్పని సరిగా సెలవు పెట్టుకుంటారు కదా! కానీ దానికన్నా ముఖ్యమైన ధ్యాన కార్యక్రమానికి హాజరు కావడానికి

వంకలు చెబుతుంటారు.

ఈ భూమ్మీద ప్రతి ఒక్కరూ బంధాల్లో బందీ అయి ఉన్నారు. అలా బందీ అయి ఉన్నాము అని కూడా వారికి తెలియడం లేదు, వాటి నుండి విముక్తి పొందాలి అని కూడా ప్రయత్నించటంలేదు. కానీ ఆ బంధాల నుండి విముక్తి పొందటమే అంటే విడుదలవ్వడమే మోక్షము.

బంధాలనుండి విముక్తి పొందడానికి, మోక్షాన్ని పొందటానికి ఏకైక మార్గం పత్రి గారు మనకి బోధించిన "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

ప్రతి ఒక్కరూ మోక్షాన్ని పొందటానికి ప్రయత్నించాలి. ఈ భూమ్మీద సకల భోగాలూ ఉంటాయి కానీ బంధాల్లో బందీ అయి ఉంటారు, జైలులో ఉన్న ఖైదీ ఆ జైలు నుండి ఎలా తప్పించుకోలేడో, ఈ భూమ్మీదకు వచ్చిన మానవుడు బంధాలనుండి కూడా తప్పించుకోలేడు.

కొంతమంది ఈ బంధాల నుండి బయట పడటానికి ఆత్మహత్య చేసుకుంటారు. కానీ వారికి తెలియదు గోడకు కొట్టిన బంతిలా తిరిగి వస్తారని. ఆత్మహత్య చేసుకుంటే విముక్తుడు అయిపోవచ్చు అనుకుంటాడు కానీ వాడు మరల ఈ భూమి మీద జన్మించి ఇంకా ఎక్కువ కష్టాలు పడతాడు. అందుకే పత్రి గారు ఆత్మహత్య చేసుకోవద్దు, చేసిన కర్మలు ఈ భూమ్మీద అనుభవించవలసిందే, వాటి నుండి బయటపడటానికి ఒక్క సద్గురువుని ఆశ్రయించటం ఒక్కటే మార్గం అని చెప్పడం జరిగింది. భూమ్మీద కర్మలు చేసినన్నాళ్ళు జన్మలు తప్పవు కాబట్టి వాటి నుండి బయటపడే మెలకువలు, సూక్ష్మాలు చెప్పగలిగేవాడు సద్గురువు ఒక్కడే. అందుకే ప్రతి ఒక్కరూ గురువును పట్టుకుంటే మోక్షాన్ని ఎలా పొందగలరు అన్న విషయం తెలుసుకుంటారు.

::2::

# చావు పుట్టుకల నుండి తప్పించుకోవడమే మోక్షము

ఇక్కడ మీరు ఒక విషయం తెలుసుకోవాలి ఏమిటంటే? అందరూ ఆత్మలే. ఆత్మలైన మీరు ఒక పూర్ణాత్మ నుంచి కానీ, మూలాత్మ నుంచి కానీ విడువడినటువంటి అంశలు. అలా పూర్ణాత్మ తన నుంచి ఒక అంశ విడుదల చేసి దాన్ని ఒక శరీరంలో ప్రవేశపెడుతూ ఒక లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. ఆ లక్ష్యం "నువ్వు కూడా నాలా అంటే నా స్థాయికి ఎదగాలి అంటే నాలా తయారు కావాలి" అని. అలా ప్రతి అంశాత్మ పూర్ణాత్మ నిర్దేశించిన లక్ష్యం చేరే వరకు మరల, మరల జన్మలు తీసుకుంటూనే ఉంటుంది.

అంశాత్మలు అయిన మీరు తల్లి గర్భంలో ఉన్నంత వరకు మీ లక్ష్యం ఏమిటి? అనేది గుర్తుంటుంది. కానీ ఎప్పుడైతే తల్లి గర్భం నుంచి బయటకు వస్తారో, ఈ మాయా ప్రపంచంలో పడిపోతారో అప్పుడు అన్ని మర్చిపోతారు. "నేను ఎవరు? నేను దేని కోసం ఈ భూమ్మీదకి వచ్చాను? ఈ భూమ్మీద నేను చేయవలసిన పని ఏమిటి? నేను సాధించవలసింది ఏమిటి? అనేవి మర్చిపోయి సంసారంలో పడి నా తల్లి, నా తండ్రి, నా కుటుంబ సభ్యులు, నా బంధువులు, నా స్నేహితులు, వీళ్ళు నా శత్రువులు, వీళ్ళు నా మిత్రులు ఇలా అనుకుంటూ జీవిస్తూ ఉంటారు.

అంతేకాదు ఇంకా ఎదిగే  కొద్ది నేను సుఖపడాలి అని, అలా సుఖపడాలి అంటే బాగా సంపాదించుకోవాలి, దాని కోసం బాగా చదువుకోవాలి అనుకుంటూ ముందు చదువు మీద దృష్టి పెడతారు.

అలా మెల్లిమెల్లిగా చదువు పూర్తి అయిన తరువాత ఉద్యోగం సంపాదించటం, ఆ తర్వాత వివాహం చేసుకోవడం, పిల్లల్ని కనడం, వారి మంచిచెడ్డలు చూసుకోవటం, వాళ్ళని కూడా బాగా చదివించి పెద్దవాళ్లను

చేయడం, ఇలా చివరకు ముసలి వయస్సుకి వస్తారు. ఈ క్రమంలో ఎన్నో కష్టాలు, సమస్యలు, బాధలు ఉంటాయి, కాబట్టి వాటిని అన్ని అనుభవిస్తూ చివరకు ముసలి వయసు వచ్చాక శరీరాన్ని వదిలేస్తారు.

అలా శరీరాన్ని వదిలి బయటకి వచ్చిన మీరు అంటే ఆత్మ మాయ నుండి బయటపడతారు. అప్పటి వరకు ఈ శరీరంతో మాయలో ఉన్నారు, శరీరం వదలగానే వాస్తవంలోకి వస్తారు. అప్పుడు మీరు చేసిన తప్పులు అన్నీ మీకు తెలుస్తాయి. ఈ భూమ్మీదకి ఎందుకోసం వచ్చారో, ఏం చేయాలని వచ్చారో! మర్చిపోయినందుకు ఎంతో బాధపడతారు.

"అరే వచ్చింది జ్ఞానం సంపాదించుకోవడానికి, పూర్ణాత్మ కావడానికి కానీ చేసిందంతా ధన సంపాదన, సంసారాన్ని పోషించు కోవడం, పిల్లల్ని పోషించు కోవడం ఇదే జీవితం అనుకుంటూ చేయకూడని పనులు చేస్తూ రకరకాలైనటువంటి జీవితాలు జీవించి శరీరం వదిలేసామని" అర్థంవుతుంది.

ఆపై లోకాలలో కౌన్సెలింగ్ జరిగిన తర్వాత మరలా ఇంకొక శరీరం తీసుకుంటారు. ఈసారైనా మీరు అనుకున్నది సాధించాలని, చనిపోయిన తర్వాత మళ్ళీ ఇంకో శరీరం తీసుకొని పుడతారు, ఇది ఒకసారి జరగదు కొన్ని వందల సార్లు జరుగుతుంది అంటే చావడము పుట్టడం, చావడము పుట్టడం. పుట్టే ముందు అన్ని అనుకుంటారు పుట్టిన తర్వాత అన్ని మర్చిపోతారు. ఏదేదో చేసి మళ్ళీ చనిపోతారు. పోల్లే ఏమైనా చాలా సుఖంగా ఉన్నారా? బాధలు లేవా? కష్టాలు లేవా? రోగాలు లేవా? అంటే అన్ని ఉంటాయి, నరకం అనుభవిస్తారు, అశాంతికి లోనవుతారు, ఎన్నో గొడవలు పడతారు, బాధలు పడతారు, చివరికి చనిపోతారు. ఇలా చావు పుట్టుకలతో జీవిస్తూ ఉంటారు.

జీవితం ఇంతే అనుకుంటా ఆ భగవంతుడు నన్ను అన్యాయం చేశాడని, నన్ను పట్టించుకోవట్లేదని, నేను కోరింది ఇవ్వలేదని ఆ భగవంతుడి

మీద నింద లేస్తూ తాను ఎవరో? తనకు తెలియక ఇలా ఎన్నో జన్మలు గడిచిపోతూ ఉంటాయి.

చివరికి సాత్విక గుణంలోకి వచ్చాక కొంచెం ఆలోచించగలుగుతారు. అంటే ఇంచుమించు 300 జన్మలు దాటాలి. సాత్విక గుణంలోకి వచ్చాక ఏమిటి దీనికి అంతం లేదా? ఇంకెప్పుడు నా బ్రతుకు ఇంతేనా? ఇలా పాట్లు పడవలసిందేనా? అసలు భగవంతుడు నన్ను ఎందుకు సృష్టించాడు? నన్ను ఇన్ని బాధలు పెట్టడం ఏమిటి? నేను ఏమన్నా సృష్టించమన్నానా? ఇలా రకరకాలుగా ఆలోచిస్తూ ఉంటారు.

చివరికి ఒక సద్గురువుని చేరతారు. అప్పుడు ఆ సద్గుగురువు ద్వారా ఎంతో జ్ఞానాన్ని తెలుసుకుంటారు, ఎన్నో విషయాలు తెలుసుకుంటారు. తెలుసుకొని "నేను దేహం కాదు ఆత్మను, నేను చేసుకున్నవే నేను అనుభవిస్తున్నాను, ఎవరి వాస్తవానికి వాడే సృష్టికర్త, ఇది ఎవరికీ సంబంధం లేదు" అని సద్గురువు ద్వారా తెలుసుకొని బాగా ఆలోచిస్తారు.

సద్గురువు "ఇలా జీవించడం కాదు నాయనా! ఈ జీవితం లేకుండా చేసుకోవాలి అదే మానవ జన్మ యొక్క లక్ష్యం" అని బోధిస్తాడు. అంటే **"చచ్చి పుట్టే జీవితం కాదు చావు పుట్టుకలు లేని జీవితం పొందాలి"** అని ఆ సద్గురువు చెప్తాడు.

శంకరాచార్య వారు చెప్పినటువంటి సందేశాలు, గొప్ప గొప్పవారు చెప్పినటువంటి సందేశాలు అన్నీ సద్గురువు ద్వారా తెలుసుకుంటాడు.

శంకరాచార్యుల వారు

**"పునరపి జననం,**

**పునరపి మరణం,**

**పునరపి జననీ జఠరే శయనం**

**ఇహ సంసారే బహుదుస్తారే"**

మళ్ళీ మళ్ళీ పుట్టడం, మళ్ళీ మళ్ళీ చావడం, మళ్ళీ తల్లి గర్భంలో పడటం లాంటి చాలా భాధలతో కూడుకున్నది అని శంకరాచార్యుల వారు చెప్పారు.

వశిష్టుల వారు కూడా **"జీవితంలో సుఖాలు గోరంత, దుఃఖం కొండంత "** అని చెప్పారు. ఈ విషయాలన్నీ అనుభవపూర్వకంగా తెలుసుకొని ఇక చివరికి కృతనిశ్చయంతో ఈ జన్మల నుంచి బయట పడాలి, ముక్తి పొందాలి అని నిర్ణయించుకుంటారు.

అప్పుడు ఆ సద్గురువు చెప్పినవన్నీ ఆచరిస్తూ, ఆ సాధనలు చేస్తూ, ఆ జ్ఞానం సంపాదించుకుంటూ తాను ఇంతకుముందు చేసిన కర్మలన్నీ రహితం చేసుకోవడానికి కృషి చేస్తూ ఉంటారు. ఎప్పుడైతే జ్ఞానం అగ్నిలా ప్రజ్వరిల్లు తుందో అప్పుడు కర్మలన్నీ దగ్ధమైపోతాయి.

ఎప్పుడైతే కర్మలన్నీ రహితమైపోతాయో అప్పుడు వాళ్ళకు ఇంక జన్మ అన్నది ఉండదు, పుట్టుక ఉండదు. అంటే చావు పుట్టుకల నుంచి తప్పించు కుంటారు, దాన్నే 'మోక్షము' అంటారు.

అందుచేత గుర్తుపెట్టుకోండి ఎవ్వరైనా సరే చివరికి సాధించవలసింది, సంపాదించవలసింది ఇదే.

::3::

# "శాశ్వతంగా దుఃఖం నుంచి బయట పడడమే మోక్షం"

ఎవరైనా, ఎన్ని జన్మలు ఎత్తినా చివరకు పొందవలసింది, సాధించవలసింది మోక్షమే. ఎందుకంటే ఇంతకుముందు ఎన్నో యుగాల నుండి ఎంతోమంది గొప్పవాళ్ళు, గురువులు, జ్ఞానులు, యోగీశ్వరులు, ఋషులు, మహర్షులు మానవులకు బోధించింది మోక్షం పొందమని. మోక్షం పొందకపోతే దుఃఖంలో కూరుకుపోతారు, అప్పుడు మీ బ్రతుకు ఊబిలో దిగిన వారిలా తయారవుతుంది.

మీ అందరికీ తెలుసు ఊబి అంటే? దానిలో దిగిన వారు ఎంత ప్రయత్నించినా బయటకు రాలేరు, ఇంకా ఇంకా దానిలో కూరుకు పోతారు. ఎంతటి బలవంతుడైనా సరే, ఎటువంటి వాడైనా సరే, ఎంత గొప్పవాడైనా సరే ఊబిలో నుంచి బయట పడడం చాలా కష్టం.

ఎందుచేతనంటే "జీవుడు అంటే దేహం ధరించిన ఆత్మ", అందుకే గొప్ప వాళ్ళంతా మానవుడు అని కాకుండా జీవుడు అని సంబోధిస్తారు. ఈ శరీరం ధరించిన ఆత్మ మెల్లి మెల్లిగా దుఃఖంలో కూరుకుపోతుంది. దానికి ముఖ్య కారణం ఈ మానవులు సుఖాలకు బానిసై వాటిని అనుభవించాలనే తపనతో చేయకూడని పనులు చేస్తూ, అధర్మంగా వ్యవహరిస్తూ, సృష్టి విరుద్ధంగా ప్రవర్తిస్తూ పాపాలు చేస్తూ కష్టాల్లో, దుఃఖంలో కూరుకుపోతారు.

ఆ దుఃఖం భరించలేని స్థితికి చేరుకున్నప్పుడు ఒక సద్గురువును ఆశ్రయిస్తాడు. అప్పుడు సద్గురువు "నాయనా! నువ్వు ఇలా జీవిస్తూ పోతే ఇంకా ఇంకా మునిగిపోవడమే, జీవించలేని దుర్భరమైన పరిస్థితిలోకి పోతావు, ఏమిటి ఈ జీవితం అనుకుంటావు? అందుచేత ఇకనైనా నువ్వు ఈ దుఃఖం నుంచి బయట పడే ప్రయత్నం చేయి" అని వాడికి బోధిస్తాడు.

చాలామంది వచ్చిన దుఃఖం నుంచి బయట పడాలి అని చూస్తారు కానీ ఈ దుఃఖం నుంచి శాశ్వతంగా బయట పడాలని ఎవ్వరు ప్రయత్నించరు.

అది ఈ జన్మ లేని స్థితి అంటే మోక్షం పొందితేనే సాధ్యమవుతుంది. అప్పుడే నువ్వు శాశ్వతంగా దుఃఖం నుంచి బయట పడతావు అని సద్గురువు ద్వారా తెలుసుకుంటారు. సద్గురువులు ఎప్పుడు ఆ లాభాలు, ఈ లాభాలు వస్తాయని చెప్పరు, వాళ్ళు ఎంతసేపూ మిమ్మల్ని శాశ్వతంగా దుఃఖం నుంచి బయట పడేయడానికే చూస్తారు. ఏ గురువు అయితే దుఃఖం నుంచి శాశ్వతంగా బయట పడేయటానికి కృషి చేస్తూ ఉంటారో, బోధిస్తూ ఉంటారో వారు అసలైన సద్గురువులు.

అంతేకానీ నీకు వచ్చిన ఒక కష్టాన్ని తొలగించేవాడు సద్గురువు కాదు? సహజంగా ఏం నమ్ముతారు అంటే నాకు ఏ కష్టం వచ్చినా గురువు ఉన్నాడు కదా? ఆయన ఖచ్చితంగా నన్ను బయట పడేస్తాడు అనే మూఢ నమ్మకంతో ఆ గురువును అనుసరిస్తూ ఉంటారు. కానీ గుర్తుపెట్టుకోండి ఆ గురువు అసలు నీకు కష్టమే రాకుండా చేయాలి, అప్పుడు వాడు గొప్ప గురువు. ఒక కష్టాన్ని పోగొట్టే గురువు గొప్ప గురువు కాదు. ఎందుచేతనంటే కొన్నాళ్ళు ఆగితే ఆ కర్మ అనుభవిస్తే అది ఎలాగూ పోతుంది. అది గురువు ప్రతాపం కాదు, అసలు ఆ కర్మ నువ్వు అనుభవించడం వల్ల బయట పడ్డావు అన్న సంగతి నీకు తెలియదు.

అందుచేత ఒకటే గుర్తుపెట్టుకోండి ఎవరు సద్గురువు? అంటే ఎవరైతే నిన్ను దుఃఖం నుంచి శాశ్వతంగా బయట పడవేయగల మార్గం బోధించగలుగుతారో వాడే సద్గురువు. అటువంటి వారి బోధలు ఆచరిస్తూ శాశ్వతంగా దుఃఖంలో నుంచి బయటపడాలి. దాన్నే మోక్షం అంటారు.

ఆ మోక్షం పొందే మార్గమే ఆత్మజ్ఞానం పొందడం, పూర్ణ జ్ఞానం పొందడం. ఇప్పుడు మీరంతా కూడా ఆ ప్రయత్నమే చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయాన్నే 4 గంటలకు లేచి సాధన చేస్తున్నారు, ప్రతినెలా మూడు రోజులు ఆత్మజ్ఞాన తరగతులకు భీమవరం వస్తున్నారు, అక్కడ రోజుకు 10 గంటలు సాధన చేస్తున్నారు. అంటే మీరు శాశ్వతంగా దుఃఖం నుండి బయటపడటం

కోసమే అంత కృషి చేస్తున్నారు.

ఈ సుఖాలు, భోగాలు, సంసారం తాత్కాలికం, వీటి కోసం కాదు మీరు భూమ్మీదకు వచ్చింది. ఈ భర్త/భార్య, పిల్లలు, బంధువులు ముందు జన్మలలో లేరా? చెప్పండి? ఈ ఆస్తులు, ఈ సుఖాలు, ఈ భోగాలు ఇంతకు ముందు ఎన్నో జన్మలలో అనుభవించారు, ఇప్పుడు మీరు అనుభవించే దాని కంటే ఎంతో గొప్పగా అనుభవించారు. వాటి కోసం మీరు రాలేదు, మీరు వచ్చింది దేనికి అంటే దుఃఖం నుంచి శాశ్వతంగా బయట పడటం కోసం.

అందుచేత ఈ ప్రాపంచిక సుఖాల మీద దృష్టి తగ్గించి, దుఃఖం నుంచి బయటపడే ప్రయత్నం చేయండి. దానికి చేయవలసింది జ్ఞానం సంపాదించుకోవటం. అందుకే నేను కానీ, మేడమ్ కానీ జ్ఞానం గురించి కాకుండా వేరే దేని గురించి బోధించము. లాభాల గురించి కానీ, అనుభవాల గురించి కానీ, మీకు కలిగే సుఖాల గురించి కానీ చెప్పవచ్చు, కానీ అవి మిమ్మల్ని ఈ దుఃఖం అనే ఊబి నుండి బయట పడవేయ లేవు.

మీరు సంసారంలో, భోగాల్లో ఉన్నారు అని అనుకుంటున్నారు కానీ మీరు దుఃఖం అనే ఊబిలో ఉన్నారు, దానిలో నుంచి బయటపడండి. వున్న సమస్యలు పోయినంత మాత్రాన మీరేమి బయటపడినట్టు కాదు, మీ ఖాతాలో కొండంత కర్మలు ఉన్నాయి. అవి ఇంకో వెయ్యి జన్మలు ఎత్తినా ఖర్చు పెట్ట లేరు, అది మీ తరం కాదు.

కానీ **"కొండంత గడ్డి మేటు చిన్న అగ్గి పుల్ల గీస్తే ఎలా దగ్ధమైపోతుందో! ఈ జ్ఞానం అనే అగ్గిపుల్ల కొండంత కర్మల్ని ఇట్టే దగ్ధం చేస్తుంది".** అందుకే గుర్తుపెట్టుకోండి సద్గురువులు ఎప్పుడు అదే బోధిస్తారు. అలా కర్మల్ని పూర్తిగా దగ్ధం చేసుకుంటే ఇక జన్మే వుండదు, అదే 'మోక్షం'.

అందుచేత ధ్యానం చెయ్యండి, జ్ఞానం సంపాదించుకోండి, దుఃఖం నుంచి శాశ్వతంగా బయటపడండి, మోక్షాన్ని పొందండి.

::4::

# "శాశ్వత ఆనంద స్థితిని పొందడమే మోక్షం."

మానవుడు ఈ భూమ్మీద ఏదో ఒక రకమైన దుఃఖంతోనే జీవిస్తూ ఉంటాడు. వారి జీవితంలో సంతోషమన్నది అప్పుడప్పుడు కలుగుతూ ఉంటుంది. కానీ ఆనంద స్థితిని అనుభవించేవాళ్ళు చాలా తక్కువ. దానికి కారణం "ఆనందం అన్నది ఆత్మకు సంబంధించింది, సంతోషం అన్నది మనసుకు సంబంధించింది, సుఖం అన్నది శరీరానికి సంబంధించింది". అందుచేత మానవులు ఈ సుఖ సంతోషాలు పొందగలుగుతున్నారు కానీ ఆనంద స్థితి పొంద లేకపోతున్నారు.

ఈ ఆనందం అన్నది ఆత్మకు సంబంధించింది కాబట్టి ఆత్మ స్థితిలో జీవించేవాడు, ఆత్మ స్థితిని పొందినవాడు ఈ ఆనందాన్ని అనుభవించగలడు. ఈ ఆనందం ఎంత గొప్పది అంటే వర్ణించడానికి వీల్లేదు, అనిర్వచనీయమైనది అంటే నిర్వచించలేనిది, వివరించడానికి కూడా సాధ్యం కాదు. ఇటువంటి ఆనందాన్ని ఎవరికివారు అనుభవించాలి తప్ప ఇతరుల వివరించేది కాదు. ఉదాహరణకు ఎవరైనా మామిడిపండు తిని అది చాలా మధురంగా ఉంది అంటారు కానీ ఎలా వుంటుంది చెప్పమంటే చెప్పలేరు. అలాంటి మామిడి పండు తిని ఆ మాధుర్యాన్ని అనుభవించినప్పుడే తెలుసుకోగలరు.

అలాగే ఈ ఆత్మానందాన్ని అనుభవించగలిగిన వారికే అది ఎంత గొప్పదో అర్థం అవుతుంది, అందుకే దానిని అనుభూతి అంటారు. "ఆత్మానుభూతి అని ఎందుకు అంటారంటే ఆత్మను తెలుసుకోగలిగిన శక్తి మానవ ఇంద్రియాలకు లేదు. బాహ్యేంద్రియాలకు కానీ కర్మేంద్రియాలకు కానీ మనసుకు కానీ ఆ శక్తి లేదు. అందుకే ఆత్మని అంటే ఆ భగవంతుని ఇంద్రియాతీతడు అని కూడా అంటారు, ఇంద్రియాలకు అతీతమైన వాడు" అటువంటి భగవంతుడు అంటే ఆత్మ గురించి అనుభూతి పొందవలసిందే

తప్ప, దేని ద్వారా గ్రహించటం సాధ్యం కాదు.

మరి అటువంటి స్థితి సంసార జీవితంలో పొందగలరా? అంటే పొందుతారు. ఎప్పుడు? అంటే సంభోగ సమయంలో. ఆ సంభోగ సమయంలో పరాకాష్టకి చేరుకున్నప్పుడు ఒక నిమిషకాలం మానవుడు పొందే ఆ ఆనందానుభూతి వర్ణించడం ఎవరి వల్ల కాదు, అంత గొప్పది ఆ అనుభూతి.

అందుకే స్త్రీ, పురుషులు ఇద్దరూ ఒకటి కావడానికి, ఒకటి గా ఉండడానికి, కలిసి జీవించడానికి ముఖ్య కారణం ఈ అనుభూతే. అందుకే సృష్టికర్త వీళ్ళద్దరినీ కలిపి ఉంచడానికి, స్త్రీ, పురుషులు అనే ఇద్దరినీ ఏర్పాటు చేశాడు. ఈ ఏర్పాటు ఉన్నందువల్లే ఎన్ని గొడవలు పడుతున్నా భార్యా భర్తలు ఇద్దరూ కలిసి ఉంటారు. తప్పని పరిస్థితిలో విడిపోవడానికి చూస్తారు తప్ప, ఎక్కువ శాతం కలిసే ఉంటారు, అంత గొప్ప ఆనంద స్థితి అది. రోజంతా కష్ట పడేది ఆ నిమిష కాలం పొందే ఆనంద స్థితి కోసమే.

అదే "ఆనంద స్థితి ధ్యానంలో సమాధి స్థితికి చేరుకున్నప్పుడు యోగులు పొందుతారు. ఆ సమాధి స్థితిలో వాళ్ళు సాక్షాత్తు ఆత్మతో అంటే భగవంతునితో అంటే పర బ్రహ్మతో అంటే ఆ సృష్టికర్తతో అంటే ఆ ఆనంద స్వరూపునితో ఉన్నప్పుడు అటువంటి ఆనంద స్థితిని అనుభవించ గలుగుతారు". వాళ్ళు అనుభవిస్తున్నటువంటి ఆ ఆనందం, మానవుడు ఎన్ని భోగాలు అనుభవించినా ఆ ఆనంద స్థితి ముందు దిగదుడుపే.

ఎందుచేతనంటే మానవుని జీవితంలో ఉన్న సుఖాలు గానీ, సంతోషాలు గానీ తాత్కాలికమైనవి, అవి తాత్కాలికమైన సుఖాన్ని ఇస్తాయి. నీకు నచ్చింది తిన్నావు, అది తింటున్నంతసేపు సుఖంగా అనిపిస్తూ ఉంటుంది. బయట ఎక్కువ వేడిగా ఉన్నప్పుడు ఏసీలో పడుకున్నావు ఎంతో సుఖంగా అనిపిస్తుంది. ఇలా అనుభవిస్తున్నంత సేపు బాగానే ఉంటుంది కానీ అయిపోయిన తర్వాత ఉండదు.

అలాగే నువ్వు కోరుకున్నది లభించినప్పుడు, నువ్వు అనుకున్న

లాభాలు వచ్చినప్పుడు, నువ్వు అనుకున్నట్టు మంచి ఉద్యోగం సంపాదించుకున్నప్పుడు సంతోషంగానే ఉంటుంది. కానీ అది కొన్ని రోజులే. ఆ తర్వాత దాని కంటే మంచి ఉద్యోగం వస్తే బాగుండు అని అనిపిస్తుంది.

అందుచేత ఈ సుఖ సంతోషాలు రెండు తాత్కాలికమే. కానీ ఎవరైతే ధ్యానంలో సమాధి స్థితి పొందుతారో అంటే ఆత్మతో ఉండిపోతారో, భగవంతునితో ఉండిపోతారో అక్కడ పొందే ఆనందం అంతు లేనిది, అనిర్వచనీయమైనది. ఆ స్థితి పొందినవారు బయటకు రాలేరు, ఆ స్థితిని సమాధి స్థితి అంటారు. యోగులు అటువంటి సమాధిస్థితిని పొందుతారు కాబట్టి వారు ఆ స్థితి నుండి బయటకు రాలేరు.

చూడండి భీమవరం వచ్చిన వాళ్ళు చాలామంది ఉదయాన్నే ఐదింటికి ధ్యానంలో కూర్చోమంటే ఆ ఆనంద స్థితిని అనుభవించిన వాళ్ళు నాలుగు, మూడు, రెండింటికి కూడా కూర్చుంటున్నారు. ఎందుకు అంటే ఆ ఆనందాన్ని అనుభవించడం కోసం.

నిజంగా వాళ్ళను అలా ఉంచినా ఉండి పోతారు కూడా. కానీ ఇంకా తెలుసుకోవాల్సినవి, పొందవలసిన జ్ఞానం ఉంది కాబట్టి ఓకే చెప్పి లెగ్గొడుతున్నాం. అలా వుండిపోవడానికి కారణం ఆనందాన్ని పొందడం వల్లే, ఆత్మ అంటే ఆనంద స్వరూపమే, భగవంతుని యొక్క స్వరూపమే ఆనందం. అటువంటి ఆనంద స్వరూపంతో ఉన్నప్పుడు ఇంకేం కావాలి చెప్పండి? ఆ రుచి తెలిసిన వాడికి, ఆ అనుభవం పొందిన వాడికి ఇంకేమీ అక్కర్లేదు. అటువంటి ఆనందానుభూతిని పొందడమే నిజమైన మోక్షం. అందుచేత అటువంటి "శాశ్వత ఆనంద స్థితి పొందడాన్నే మోక్షము" అంటారు.

మీరు చూడండి మామూలు జీవితంలో ఏదో మధ్య మధ్యలో కాస్త సంతోషంగా ఉన్న, ఎక్కువ దుఃఖంలో, అశాంతిలో ఉంటారు. కారణం ఏదో ఒక సమస్య, ఏదో ఒక రోగం, ఏదో ఒక కష్టం, ఏదో ఒక బాధ ఇలా ప్రతి ఒక్కరిని వేధిస్తూనే ఉంటుంది.

అలా దుఃఖంతో, అశాంతితో పుట్టిన దగ్గరనుండి చనిపోయేవరకు బ్రతుకుతాడు. అందుకే నేను "బ్రతకడం కాదు జీవించాలి" అంటాను. బ్రతికేవాడు గొప్పవాడు కాదు జీవించగలిగినవాడే గొప్పవాడు అంటారు. అందుచేత మామూలు జీవితంలో దుఃఖంతోటి ఉంటారు. ఏదో సంతోషకరమైన సంఘటనలు ఒకటి అలా జరిగినప్పుడు సంతోషిస్తూ ఉంటారు. కానీ ఎక్కువ దుఃఖంలోనే ఉంటూ ఉంటారు, అశాంతితోనే జీవిస్తూ ఉంటారు.

ఇప్పుడు చూడండి కొన్ని కొన్ని పండగలు వచ్చినా, పుట్టిన రోజులు వచ్చినా, మ్యారేజ్ డేలు వచ్చినా, కొత్త సంవత్సరం వచ్చినా, పెద్ద పండగలైన సంక్రాంతి లాంటివి వచ్చినా విష్ చేసుకోవడం ఒక ఆచారం. బర్త్ డే అయితే "విష్ యు హ్యాపీ బర్త్‌డే" అంటారు, అంటే ఈ పుట్టిన రోజు నాడు హ్యాపీగా ఉండు అని అందరూ చెప్తారు. ఎందుకు వచ్చింది ఈ ఆచారం అంటే నువ్వు ఆ రోజైనా సంతోషంగా వుండు అని.

అలాగే కొత్త సంవత్సరం రోజైనా ఆనందంగా ఉండు, సంక్రాంతి పండక్కైనా ఆనందంగా ఉండు, సంతోషంగా ఉండు, హ్యాపీగా ఉండు అని విష్ చేస్తారు. సంతోషంగా ఉండమని చెప్తారు, ఎందుకు చెప్తారు అంటే వాడు కనీసం ఆ రోజైనా సంతోషంగా వుంటాడు అని చెబుతుంటారు. ఎప్పుడు సంతోషంగా ఎలాగూ ఉండలేవు కనీసం ఈరోజైనా సంతోషంగా ఉండు అని అలా చెప్పే ఆచారం వచ్చింది.

నిజంగా ఎప్పుడు ఆనందంగా ఉంటే ఆనందంగా ఉండు అని చెప్పాల్సిన అవసరం ఏముంది? ఎప్పుడు సంతోషంగా ఉంటే సంతోషంగా ఉండు అని చెప్పాల్సిన అవసరం ఏముంది? సంతోషంగా లేడు కాబట్టే సంతోషంగా ఉండు అని చెప్తున్నారు. అందుచేత సంతోషం కాబట్టి అప్పుడప్పుడు పొందుతున్నారు కానీ ఆనందం అన్నది శాశ్వతంగా ఉంటుంది. అంటే భగవంతుని పొందినవాడు శాశ్వతంగా ఎప్పుడూ అంతులేని అనిర్వచనీయమైన ఆనంద స్థితిలో ఉంటాడు.

కొంత మందికి ఓ డౌట్ ఉంటుంది. మోక్షం పొందిన తర్వాత ఇంకేముంటుంది? అని. చాలామందిలో ఉండే అభిప్రాయం ఏమిటంటే మోక్షం పొందినవాడు భగవంతునిలో ఐక్యమైపోతాడు అని అనుకుంటారు. కానీ "ఏ ఆత్మ కూడా పూర్ణాత్మ స్థాయికి ఎదిగినప్పుడు పూర్ణాత్మలో ఐక్యం అవ్వదు, మూలాత్మలో ఐక్యం అవ్వదు. ఆ ఆత్మ పూర్ణాత్మగా అయిన తర్వాత పూర్ణాత్మ గానే ఉండిపోతుంది. అలా పూర్ణాత్మగా అయిన తర్వాత మూలాత్మ, పూర్ణాత్మ ఎలాంటి పనులు చేస్తూ ఉంటాయో అంటే సృష్టి కార్యక్రమాలు చేస్తూ ఉంటాయో ఆ రకమైన పనులే చేస్తూ ఉంటారు"

మోక్షం పొందనివాడు దుఃఖంతో, అశాంతితో జీవిస్తాడు. కానీ మోక్షం పొందినవాడు అంటే దుఃఖం నుంచి శాశ్వతంగా బయటపడినవాడు, ఆనంద స్థితిని పొందినవాడు, ఆ ఆనందంతో ఆ శాశ్వత ఆనంద స్థితిలోనే ఈ పనులన్నీ చేసుకుంటాడు. చాలామంది మోక్షం పొందాక ఇంకేం ఉండదేమో అనుకుంటారు, కానీ ఇంకా జీవితం ఉంటుంది, ఇంకా ఉంటారు, కానీ వాళ్ళు ఎప్పుడూ ఆనంద స్థితిలో ఉంటారు.

అందుకే యోగులు, యోగీశ్వరులు, ఋషులు, మహర్షులు ఆ స్థితి పొందమనే చెప్తూ ఉంటారు, పొందే మార్గం కూడా చెప్పారు. అందుకే వాళ్ళ సందేశాలు వినడం వారి యొక్క గ్రంథాలు చదవడం ఎందుకు చేస్తాము? అంటే వాళ్ళు ఆ అనుభవం పొంది బోధించారు కాబట్టి. మీరు అది తెలుసుకోవడం వల్ల, ఆచరించడం వల్ల మీరు కూడా ఆ స్థితిని పొందవచ్చు.

అందుచేత గుర్తుపెట్టుకోండి మోక్షము అంటే సామాన్యమైన విషయం కాదు, "శాశ్వత ఆనంద స్థితి". మోక్షం పొందిన వాడికి ఎప్పుడూ ఆనందమే. ఆ మోక్షం పొందినవాడికి మళ్ళీ జన్మ ఉండదు.

అందుకే మోక్షం అన్న దానికి శాశ్వత ఆనంద స్థితి అని కూడా చెప్పటం జరుగుతుంది. ఆ ప్రయత్నమే ఇప్పుడు మీరు చేస్తున్నారు.

::5::

# "స్వ స్వరూపమగు దైవ స్థితి కలిగి ఉండుటయే మోక్షము"

గొప్ప గొప్ప యోగీశ్వరులు ఈ మోక్షం గురించి వారి వారి స్థాయిలలో నిర్వచనం ఇచ్చారు. ఎవరు చెప్పినా అందరిదీ సరైన నిర్వచనమే. ఎందుచేతనంటే మానవుని యొక్క జీవిత పరమార్థం మోక్షాన్ని పొందడమే. ఎన్ని జన్మలు ఎత్తినా చివరికి మోక్షాన్ని పొందాలి, మోక్షాన్ని పొందే వరకు అలా జన్మలు తీసుకుంటూనే ఉండాలి. అందుచేత ప్రతి ఒక్కరూ మోక్షం పొందటం కొరకు ప్రయత్నం చేస్తారు.

ఇక్కడ స్వస్వరూపముఅంటే నా స్వరూపము, నా స్వరూపం ఏమిటి? అంటే నేను ఎవరు? ఇక్కడ ఏం చెప్పబడింది అంటే నా స్వరూపమైనటువంటి దైవ స్థితిని కలిగి ఉండటమే, అంటే ఆ దైవ స్థితిని పొందటమే మోక్షము.

దీని యొక్క అర్థం సహజంగా మానవులంతా నేను మానవుడిని, ఈ శరీరమే నేను అనే భావంతో ఉంటారు. ఈ శరీరానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తూ ఉంటారు. శరీర సుఖము, శరీర ఆనందము, శరీర ఆరోగ్యము, శరీర అందము, శరీర సౌష్టవము, శరీర అలంకారము ఇలా వీటి కోసమే ఎక్కువ ప్రయత్నిస్తూ ఉంటారు. అసలు వారి సమయాన్ని కానీ, శక్తిని కానీ, ధనాన్ని కానీ, వారికి ఉన్నటువంటి నైపుణ్యాలు కానీ ఏదైనా సరే ఆ శరీరం కోసమే ఉపయోగిస్తూ ఉంటారు.

ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే దాకా ఏ పని చేసినా శరీరం కోసమే చేస్తూ ఉంటారు. అంతేకాదు ఈ శరీరమే నేను అని భావించడం వల్ల ఆ శరీరానికి ఒక పేరు కూడా పెట్టుకుంటారు. ఆ పేరుకి పేరు రావాలని ఎంతో తపన పడతారు, తాపత్రయ పడతారు. ఆ పేరుకి ఒక బిరుదు వచ్చినా,

ఒక అవార్డు వచ్చినా, ఒక రివార్డు వచ్చినా ఎంతో మురిసిపోతారు.

ఇంకా ఈ సమాజంలో ఆ పేరుని అందరూ కూడా గొప్పగా భావించాలి, “అబ్బా సుబ్బారావు ఎంత గొప్పవాడు రా? ఎన్ని కోట్లు సంపాదించాడు రా? ఎన్ని సంపదలు ఉన్నాయి రా? ఎన్ని ఐశ్వర్యాలు ఉన్నాయి రా? ఎంత డబ్బు ఉంది రా? ప్రపంచంలో ఉన్న ధనికుల లిస్టులో ఉన్నాడు రా? అని చెప్పుకోవాలని తపన పడుతూ ఉంటారు.

మరి ఈ ప్రపంచంలోనే గొప్పగా ఉండాలి అంటే టాప్ లెవెల్ లోకి వెళ్ళాలి అంటే ఎంత కష్టపడాలి? ఎంత సంపాదించాలి? ధర్మంగా సంపాదిస్తే అంత గొప్పగా సంపాదించగలరా? అందుకోసం అధర్మంగా సంపాదించడానికి ప్రయత్నిస్తారు, అన్యాయంగా, అక్రమంగా, దౌర్జన్యంగా సంపాదించడానికి ప్రయత్నిస్తారు, ఇతరులని మోసగిస్తూ సంపాదించాలనుకుంటారు, ఇంకా చేయకూడని పనులు చేసి సంపాదించాలనుకుంటారు. ఎందుకు ఇవన్నీ చేస్తారు అంటే ఆ దేహానికి పేరు రావాలని, అంటే దేహానికి పెట్టుకున్న పేరుకు పేరు రావాలని. ఎందుకు? దేహం తానైనప్పుడు ఆ పేరు తాననే భావం.

అందుకే ఆ పేరుతో ఎవరైనా విమర్శించినా ఎంత బాధపడతాడో. వాడు ఒక విమర్శ చేస్తే వీడు 10 విమర్శలు చేస్తాడు. వాడు ఒక తిట్టు తిడితే నన్నెందుకు తిట్టావురా? అని వీడు 10 తిట్లు తిడతాడు, ఇలా తిట్టు కోవడం భార్య భర్తలలో కూడా ఉంటుంది.

అందుచేత ప్రతి ఒక్కరూ కూడా ఈ దేహానికి అంత ప్రాముఖ్యం ఇస్తున్నారు. ఆ శరీరం కోసం చేయకూడని పనులు చేస్తారు, తప్పులు చేస్తారు, సృష్టి విరుద్ధంగా ప్రవర్తిస్తారు. ఇటువంటి పనులు చేయడం వల్ల ఇవన్నీ కర్మలై, వాటి ఫలితం కష్టాల రూపంలో అనుభవిస్తూ ఉంటారు. మరలా ఆ కష్టాల నుంచి బయట పడడానికి, రోగాల నుంచి బయట పడడానికి, అవి రాకుండా ఉండడానికి ఎన్నో రకాల ప్రయత్నాలు కూడా చేస్తూ ఉంటారు.

ఇది సహజంగా సమాజంలో మనం చూస్తున్నాం. ఎందుకు మరి ఈ దేహానికి ఇంత టాప్ ప్రయారిటీ ఇస్తున్నారు అంటే, ఈ దేహమే నేను అని అనుకోవడం వలన.

పత్రి గారిని నేను మొట్టమొదట కలిసినప్పుడు నువ్వు దేహం కాదు అని చెప్పారు, నాకు ఎంతో ఆశ్చర్యం కలిగింది. నేను దేహం కాకపోతే మరి నేను ఎవరిని? అన్నపుడు నువ్వు ఆత్మవి అని చెప్పారు. అప్పుడు నాకు ఇంకా ఆశ్చర్యం వేసింది. ఆయన నన్ను ఒక్కడిని ఉద్దేశించి చెప్పలేదు, ఈ భూమ్మీద ఉన్న అందరిని ఉద్దేశించి చెప్పారు, అదే సత్యం. మనమంతా కూడా దేహాలం కాదు అందరం కూడా ఆత్మలమే.

మొత్తం మీద ఈ జ్ఞానవంతమైన పుస్తకాలు చదివిన తర్వాత నాకు బాగా అర్థమయింది. పత్రి గారు చెప్పింది కరెక్టు సత్యము అని. ఈ దేహం నేను కాదు, నేను ఆత్మను అన్న సంగతి అర్థమైంది. ఆ విషయం మీద ఎన్నో రకాలుగా అధ్యయనం చేసి ఎన్నో విషయాలు తెలుసుకున్నాను, ఒక విధంగా చెప్పాలంటే పెద్ద రిసెర్చ్ చేశాను. అలా తెలుసుకున్న విషయాలు అన్నీ నేను వ్రాసిన పుస్తకాలలో వివరించడం జరిగింది. నేను దేహం ఎందుకు కాదు? నేను ఆత్మని ఎలా అవుతాను? అన్న విషయాలు ఆ పుస్తకాలలో వివరించాను.

ఇదే సత్యాన్ని ఎక్కడికి వెళ్ళినా అందరికీ బోధిస్తున్నాను. ఎందుచేత నంటే అందరూ దేహం నేను అన్నట్లుగానే జీవిస్తున్నారు. అందుకే దేహం నేను అనుకొని జీవించే వాళ్ళంతా కూడా ఇతరులు వేరు, నేను వేరు అనే భావంతోనే ఉంటారు. ఎప్పుడైతే ఇతరులు వేరు, నేను వేరు అనే భావంతో ఉంటారో వారు చేసే పనులు కూడా మారిపోతాయి. వాడికంటె నేను గొప్పగా ఉండాలి, వాడికంటే ఉన్నతంగా ఉండాలి అనే భావంతో ఉంటారు. అలాగే మనుషులే కాదు జంతువులు కూడా, పక్షులు కూడా, మత్స్య జాతి కూడా, క్రిమి కీటకాలు కూడా వేరు అనే భావంలో జీవిస్తూ ఉంటారు. అందుచేత

వాటిని మానవుడు తన స్వార్థం కోసం ఉపయోగించుకుంటున్నాడు.

ప్రపంచవ్యాప్తంగా చూస్తే అంతా కూడా ఆ జంతువుల్నే తమ ఆహారంగా చేసుకున్నారు. ఎందుచేతనంటే నేను దేహము, అవి కూడా దేహాలే, నేను వేరు అవి వేరు, వాటిని నాకోసమే భగవంతుడు సృష్టించాడు, నేను ఎంజాయ్ చేయడానికే ఆయన వాటిని సృష్టించాడు అని భావిస్తూ, వాటిని హింసిస్తూ, ఎన్నో పాపాలు చేస్తున్నారు, చివరికి కష్టాలు పాలవుతున్నారు.

పైకి చూస్తే దేహం ఒక్కటే కనిపిస్తుంది, నువ్వు ముసలివాడివయ్యాక అంటే వార్ధక్యం వచ్చాక ఈ శరీరాన్ని వదిలేస్తావు అంటే చనిపోతావు, అప్పుడు రెండు జరుగుతాయి. ఒకటి కాలిపోతుంది అంటే దేహం కాలిపోతుంది, ఇంకొకటి పైకి పోతుంది అంటే ఆత్మ పైకి పోతుంది. నువ్వు శరీరం ఒక్కటే అనుకున్నావు కానీ రెండు అయ్యాయి. అందరికీ  చనిపోతాము అన్న సంగతి తెలుసు అంటే దేహం వదిలేస్తాము అని తెలుసు. కానీ నేను చనిపోయిన తర్వాత కాలిపోయే శరీరమా? లేక పైకి వెళ్లిపోయే ఆత్మా? అని ఆలోచించాలి.

అంతేకాదు ఇంకో విషయం తెలుసుకోవాలి. నీకు అసలు జన్మలు ఉన్నాయా? చనిపోయిన తర్వాత నువ్వు ఉంటావా? ఇక్కడితో నీ జీవితం ఆఖరా? లేకపోతే ఇంకా జీవితం ఉందా? అంటే నాకు ఇంకా జన్మలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు. మరి ఇంకా నీకు జన్మలు ఉంటే నువ్వు ఉన్నట్టే కదా? మరి నువ్వు ఉన్నట్లయితే ఈ రెండిట్లో ఉండేది ఏది? ఒకటి బూడిది అయిపోయింది, ఇంకొకటి పైకి పోయింది. ఈ రెండిట్లో ఉండేది 'ఆత్మ',  అందుచేత నీకు ఇంకా జన్మలు ఉన్నట్లయితే ఆత్మే నువ్వు అవుతావు అని చెప్పినప్పుడు చాలామంది అర్థం చేసుకుంటారు, తెలుసు కుంటారు. కరెక్టే నేను దేహం కాదు, నేను ఆత్మను, ఏదైతే పత్రి గారు చెప్పారో అదే నేను అని తెలుసుకుంటారు.

ఇంకా ఎన్నో ఆలోచించా "సరే నేను ఆత్మ, ఈ ఆత్మ అంటే ఎవరు?

ఆత్మ ఏంటి? ఆత్మ ఎలా ఉంటుంది?” అని ఆత్మ గురించి అధ్యయనం చేస్తే ఎన్నో విషయాలు తెలిశాయి. మరి ఇంచుమించు 20 సంవత్సరాల నుంచి ఈ ఆత్మజ్ఞానం మీదే నేను కానీ, అమ్మ కానీ ఎన్నో సబ్జెక్టులు, ఎన్నో విషయాలు చెప్తున్నాం. ఆత్మ గురించి, ఆత్మజ్ఞానం గురించి బాగా అధ్యయనం చేసిన తర్వాత ఈ ఆత్మ యొక్క లక్షణాలన్నీ తెలుసుకున్న తర్వాత, నాకు అర్థమైంది ఏమిటి అంటే? భగవద్గీతలో చెప్పినా, ఉపనిషత్తులో చెప్పినా, పురాణాల్లో చెప్పినా ఆత్మే భగవంతుడు, ఆత్మే దైవం అన్న విషయం స్పష్టంగా తెలుసుకున్నాను.

ఇక్కడ రెండు విషయాలు తెలుసుకున్నాం, ఒకటి  నేను ఆత్మను, రెండు ఈ ఆత్మే దైవం. బాగా గుర్తుపెట్టుకోండి ఒకటి నేను ఆత్మను అని, రెండోది ఈ ఆత్మే దైవమని. మరి నేను ఆత్మ అయినప్పుడు, ఆత్మ దైవం అయినప్పుడు మరి నేను ఎవరు? నేనే దైవం అన్నది అర్థమవుతుంది. అక్కడ ఇంకా ఏం అర్థమవుతుంది అంటే మరి నేను దైవం అయినప్పుడు మానవుడిగా ఎందుకు జీవిస్తున్నాను అంటే నేను ఇంకా దైవ స్థితి పొందలేదు, నేను ఇంకా మానవుడుగానే జీవిస్తున్నాను అని అర్థమవుతుంది.

నేను మానవ స్థితిలోనే ఉన్నాను, మానవుడినే అనుకుంటున్నాను అందుకే మానవుడిగానే జీవిస్తున్నాను అని అర్థమవుతుంది. మరి దైవమైన నేను మానవుడిగా జీవించడం కాదు, నేను దైవంగా జీవించాలి అంటే దైవ స్థితి పొందాలి. దైవ స్థితిని పొందాలి అంటే ఏం చేయాలి? అని ఆలోచిస్తే చివరికి నాకు అర్థమైంది ఏమిటంటే? ఒక సద్గురువుని పట్టుకోవాలి. ఆ సద్గురువుని ఆశ్రయించకపోతే నువ్వు దైవమైనా కూడా ఆ దైవ స్థితి పొందలేవు, కాబట్టి మానవుడిగా జీవిస్తావు. ఆ సద్గురువుని పట్టుకుంటే ఆ దైవ స్థితిని పొందే మార్గం చూపిస్తాడు అప్పుడు భూమ్మీద ఉన్నప్పుడే దైవంగా జీవించగలుగుతావు.

అలా జీవించాలి అంటే "సద్గురువు నాలుగు విషయాలు బోధిస్తాడు". అవి ఏమిటంటే 1) "శ్వాస మీద ధ్యాస" పెట్టి తీవ్ర ధ్యాన సాధన చేయడం, దానితో పాటు శుద్ధమైన, సాత్వికమైన శాకాహారం తీసుకోవడం 2) నేను దేహం కాదు, నేను ఆత్మని అని, నేను మానవుడిని కాదు మాధవుడని అని చెప్పే జ్ఞానవంతమైన పుస్తకాలు స్వాధ్యాయం చేయడం, 3) ఇటువంటి జ్ఞానాన్ని బోధించే వారి సాంగత్యం చేయడం అంటే భీమవరం లాంటి క్లాసులకి రెగ్యులర్ గా వెళ్తే నేను దైవాన్ని నేను మానవుడిని కాదు అని అర్థం చేసుకుంటారు. అంతేకాదు 4) ఈ మార్గంలో సేవ కూడా చేయాలి, ఈ విధంగా సద్గురువు చెప్పిన విషయాలను ఆచరిస్తున్నప్పుడు నెమ్మది నెమ్మదిగా మీలో మార్పులు వచ్చి దేహ భావన పోయి, ఆత్మ భావన కలిగి ఆ దైవ స్థితిని పొందుతారు.

ఆత్మే నేను అన్నట్టుగా జీవిస్తూ ఆత్మకి ప్రాముఖ్యం ఇస్తే దైవ స్థితిని పొంది మోక్షాన్ని పొందుతారు. మీ అసలు స్వరూపమైనటువంటి దైవ స్థితిని పొందినప్పుడు మీరు మోక్షం పొందినట్టే.

అందుకే పత్రి గారు చెప్తూ ఉంటారు, నువ్వు సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటే నువ్వు సత్యలోకానికి చేరుకుంటావు అని. అందుచేత మోక్షం అంటే ఏమీ కాదు, నేను దైవం అని తెలుసుకోవడమే. నేనే దైవం అన్నట్టుగా మీరు జీవిస్తే అంటే ఏ పని చేసినా మీరు ఆత్మకి ప్రాధాన్యం ఇవ్వాలి, నేను ఆత్మ అన్నట్టుగా జీవించాలి. అదే నేను పత్రి గారి దగ్గర గమనించడం జరిగింది.

అప్పటి నుంచి నేను కూడా ఆ రకంగా జీవించే ప్రయత్నం చేయడం మొదలుపెట్టాను. ఈ ప్రాపంచికమైన, దేహ పరమైన వాటిని ప్రక్కన పెట్టి ఎంతసేపూ ఆత్మకే ప్రాముఖ్యం ఇవ్వడం మొదలుపెట్టాను. ఏ పని చేస్తున్నా ఇది దేహానికి లాభమా? ఆత్మకి లాభమా? అన్నది ఆలోచించి, నేను ఆత్మ అయినప్పుడు ఆత్మకే టాప్ ప్రయారిటీ ఇవ్వాలి కాబట్టి ఆ రకంగా జీవిస్తున్నాను. అది నేను పత్రి గారి దగ్గర స్పష్టంగా గమనించాను.


అలా ఎవరైతే నేను ఆత్మ అన్నట్టు జీవిస్తారో కచ్చితంగా వాళ్ళు మోక్షానికి దగ్గరైనట్లే, అలా పూర్తిగా జీవించగలిగినట్లయితే మీరు ఈ భూమ్మీదే మోక్షస్థితిని పొందినట్లు లెక్క. మీరు శరీరం వదిలిన వెంటనే మీరు ఆ సత్యలోకం చేరుకుంటారు, ఇంక మరలా భూమి మీదకి తిరిగి రారు.

భగవద్గీత 8వ అధ్యాయంలోని 16వ శ్లోకం:

**శ్లో॥ ఆ బ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున ।**
**మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥ "**

తాత్పర్యం: "అర్జునా! నువ్వు బ్రహ్మ లోకాలు లాంటి లోకాలు అంటే తపోలోకం దాకా చేరుకున్నా మరలా భూమ్మీదికి వస్తావు. కానీ నేను ఉండేటువంటి సత్య లోకానికి చేరుకుంటే మరలా ఈ భూమ్మీదకి రావు, దాన్నే మోక్షము అని అంటారు".

అందుచేత గుర్తుపెట్టుకోండి, స్వస్వరూపం అంటే మన స్వరూపం ఏమిటి అంటే ఆత్మ. అంటే దైవం, ఆ దైవ స్థితి మీరు పొందగలిగితే, అలా జీవించగలిగితే అదే "మోక్షం".



::6::

# “దేహ వ్యామోహాన్ని, మనోవ్యామోహాన్ని వదిలించుకోవడమే మోక్షము.”

మానవుని దేహం ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు కలిగి ఉంటుంది. ఐదు జ్ఞానేంద్రియాలు అంటే కళ్ళు, చెవులు, ముక్కు, నాలుక, చర్మం. ఐదు కర్మేంద్రియాలు అంటే కాళ్లు, చేతులు, నోరు, మూత్ర ద్వారం, మలద్వారం. ఈ ఇంద్రియ వ్యామోహం నుంచి బయట పడటాన్నే మోక్షం అంటారు.

ఈ ఇంద్రియ వ్యామోహంలో ఉంటే ఆ దేహమే భారమై ఎన్నో కష్టాలు, నష్టాలు కలుగజేస్తుంది. ఏదో ఒక ఇంద్రియ వ్యామోహం ఉన్నా అది ప్రాణాపాయానికి దారితీస్తుందని బుద్ధుడు హెచ్చరించాడు.

దీనికి ఉదాహరణగా మనం ఒక్క ఇంద్రియ వ్యామోహంతో నాశనమైన ఐదు రకాల జీవులు గురించి తెలుసుకుందాం.

1. మిడత (కన్ను – నయనేంద్రియం) మంటను చూసి పండు అనుకుని దానిలో పడి ప్రాణాలు కోల్పోతుంది.
2. లేడి (చెవి – కర్ణేంద్రియం) వేటగాడు వినిపించే సంగీతానికి ముగ్ధురాలై వలలో చిక్కుకుంటుంది.
3. చేప (నాలుక – రసేంద్రియం) ఎరకు ఆశపడి గాలానికి చిక్కుకుంటుంది.
4. ఏనుగు (చర్మము – స్పర్శేంద్రియం): ఆడ ఏనుగు స్పర్శ కోసం ఆశపడి మావటివాడు వేసిన గోతిలో పడి బందీ అవుతుంది.
5. తుమ్మెద (ముక్కు – ఘ్రాణేంద్రియం): పూల వాసనకు పరవశించి మకరందం కోసం వెళ్తుంది, కానీ సంపంగి పువ్వు మీద వాలితే అది మరణిస్తుంది.

పైన చెప్పిన జీవులకు ఒక్కొక్క ఇంద్రియ వ్యామోహం ఉంటేనే అవి

నాశనమవుతున్నాయి. మరి 5 ఇంద్రియాలు ఉన్న మనిషి ఎంత నాశనం అవుతాడో ఆలోచించుకోవచ్చు.

మానవుడు ఈ ఐదు ఇంద్రియాలకు బానిసై ఎంతో నష్టపోతున్నాడు. మీరు గమనిస్తే చాలామంది సెల్ ఫోన్ చూడకుండా ఉండలేరు, సెల్ ఫోన్ చూస్తూ ఎంతో సమయాన్ని వృధా చేసుకుంతున్నారు, ఇంకా కొంతమంది టివి లో సీరియల్స్ చూస్తూ, సినిమాలు చూస్తూ, అక్కర్లేని న్యూస్ చూస్తూ తమ సమయాన్ని వృధా చేసుకుంటున్నారు. ఇంకా కొంతమంది రకరకాల మ్యూజిక్ లు వింటూ, డాన్స్ లు చేస్తూ వారి సమయాన్ని వృధా చేసుకుంటున్నారు. ఇంకా కొంతమంది చూసిందల్లా కావాలి అనుకుంటారు.

ఇంకా కొంతమంది రకరకాల ఆహారపదార్థాలు తింటున్నా తృప్తి పడరు, శాకాహారమే కాకుండా మాంసాహారం తింటూ ఆ రుచికి అలవాటుపడి ఎన్నో జీవులను చంపి, వాటికి నరకాన్ని చూపిస్తున్నారు. వాటిని హింసిస్తూ, అధర్మంగా జీవిస్తూ దాని ఫలితాన్ని ఎన్నో రకాలుగా అంటే కష్టాల రూపంలో, రోగాల రూపంలో అనుభవిస్తున్నారు. అందుకే పత్రి గారు జీవహింస చేయద్దు, మాంస భక్షణ వద్దు అని చెప్పారు.

అలాగే స్పర్శ గురించి చూడండి వేసవికాలం వచ్చిందంటే ఏసీలు కావాలి, చలికాలం వచ్చిందంటే హీటర్లు కావాలి. ఏది తేడా వచ్చినా మానవుడు జీవించలేడు . అలాగే ప్రయాణం చేయాలంటే మంచి కంఫర్ట్ కోసం కార్లు ఉండాలి. సుఖంగా జీవించటానికి సౌకర్యవంతమైన ఇల్లు కావాలి, అటువంటి సౌకర్యాలు పొందటానికి, అలానే సమాజంలో గొప్ప కోసం కోట్లు కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఇవి ఒక్కోసారి బాగానే ఉంటాయి, ఒక్కోసారి అవే దెబ్బ కొడుతూ ఉంటాయి. ఇలా చేసిన కర్మల ఫలితం అనుభవించేటప్పుడు ఆ జన్మలో కాని మరో జన్మలో కాని నరకాన్ని అనుభవిస్తూ వుంటారు.

ఇటువంటి వ్యామోహంతో కర్మలు చేస్తూ ఉంటే వీళ్ళకి మోక్షం

ఎక్కడి నుంచి వస్తుంది? ఎప్పటికీ మోక్షం రాదు. దేహానికి సంబంధించిన ఇంద్రియ వ్యామోహంలో ఉన్నంత కాలం వీళ్ళకి మోక్షం అన్నది రాదు. అందుచేత పెద్దలు ఏం చెప్పారంటే దేహనికి సంబంధించిన ఈ ఇంద్రియాల భారాన్ని వదిలించు కోమంటారు.

**మనో వ్యామోహం:** మనసు యొక్క లక్షణం కోరిక, మనసు ఎన్నో కోరికలు కోరుతూ ఉంటుంది, ఎన్నో కావాలంటుంది, ఎన్నో పొందాలంటుంది. ఆ కోరికలు తీర్చుకోవడానికిమానవులు చేయకూడని పనులు చేస్తారు, తప్పులు చేస్తారు, పాపాలు చేస్తారు, అధర్మంగా వ్యవహరిస్తారు. ఇన్ని కర్మలు చేస్తూ ఉంటే మోక్షం ఎక్కడ వస్తుంది.

ఆఖరికి ఈ ధ్యాన మార్గంలోకి వచ్చిన వాళ్ళు కూడా ఈ కోరికల్లోనుంచి బయట పడలేరు. అసలు ఈ ధ్యానాన్ని కోరికల గురించే వాడుకుంటున్నారు. అందుకే సంకల్పాలు పెడతారు, కోరుకున్నది నెరవేరాలని, సంకల్పాలు పెట్టి ధ్యానం చేస్తున్నారు.

ధ్యానం మోక్షం కోసం అయితే, కోరికలు తీర్చుకోవడానికి ఉపయోగిస్తున్నారు. కోరికలు తీర్చుకోవడానికి మీరు ప్రయత్నించినప్పుడు మరి ఎన్నో కర్మలు చేయవలసి వస్తుంది. కర్మలు చేస్తే కర్మలు పెరుగుతూ ఉంటాయి, కర్మలు పెరుగుతూ ఉంటే మోక్షం ఎక్కడ వస్తుంది? మరి నిజంగా ధ్యానాన్ని జ్ఞానం పొందడం కోసం ఉపయోగించు కున్నట్లయితే ఆ జ్ఞానం పెరిగి అది అగ్నిలా ప్రజ్వరిల్లినప్పుడు ఎన్నో జన్మల నుంచి చేసినటువంటి కర్మలన్నీ కూడా దగ్ధమవుతాయి.

ఎప్పుడైతే కర్మలే లేవో అదే 'మోక్షం'. జన్మ తీసుకోవాల్సిన అవసరం లేదు. అందుచేత ఈ కర్మలు తయారవడానికి ముఖ్య కారణం ఈ దేహ వ్యామోహము అంటే ఇంద్రియ వ్యామోహం, మనసు వ్యామోహం అంటే కోరికలు ఈ రెండు వదిలించుకోకపోతే మోక్షం ఉండదు, ఈ రెండు

వదిలించుకుంటే అదే మోక్షం. అందుకే పెద్దలు ఏమన్నారంటే **"దేహ వ్యామోహాన్ని, మనో వ్యామోహాన్ని వదిలించుకోవడమే మోక్షము"** అని చెప్పడం జరిగింది.

మరి ఎలా వదిలించుకుంటారు? ఎలా వదిలించుకుంటారు అంటే? ఈ వ్యామోహంలో పడడానికి కారణం మనసే, అందుచేత మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గించుకోవాలి.

దానికి ముందు ధ్యానం ద్వారా చంచలంగా ఉన్న మనసుని నిశ్చలం చేసుకోవాలి, తర్వాత నిశ్చలమైన మనసుని నిర్మలం చేసుకోవాలి అంటే శుద్ధి చేసుకోవాలి. ఇంకా ఆహార నియమాలు పాటిస్తూ తీవ్ర సాధన చేసినప్పుడు ఆ మనసు శూన్యం అయిపోతుంది.

అలా మనసు ఎప్పుడైతే శుద్ధమై శూన్యమవుతుందో! అప్పుడు మనసు ప్రాముఖ్యం పూర్తిగా తగ్గి పోతుంది. మనసే లేనప్పుడు ఈ భోగాలు, సుఖాలు కావాలనరు అంటే ఇంద్రియ వ్యామోహం నుంచి బయట పడినట్టే!

అలాగే ఈ కోరికలు కోరే మనసే లేనప్పుడు మనసు యొక్క వ్యామోహం నుంచి బయట పడినట్టే! ఆ స్థితిలో అపారమైన జ్ఞానం పెరిగి, కర్మలు దగ్ధమై మోక్షాన్ని పొందుతారు.

అందుచేత ఈ దేహ వ్యామోహాన్ని, మనో వ్యామోహాన్ని వదిలించుకోవడమే మోక్షము అని పెద్దలు చెప్పడానికి కారణం.

::8::

# “కర్మ బంధము నుండి బయట పడడమే మోక్షము”

ముందు అందరూ ఆత్మలే అన్న విషయాన్ని తెలుసుకోవాలి. ఆత్మలైన మీరు ఒక పూర్ణాత్మ నుంచి కానీ, ఒక మూలాత్మ నుంచి కానీ విడువడినటువంటి అంశాత్మలు. అంశాత్మలైనా మీకు ఆ పూర్ణాత్మ ఒక లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. “నువ్వు నా స్థితికి చేరుకోవాలి, నాలా తయారు కావాలి” అని ఒక లక్ష్యం నిర్దేశించి ఒక తల్లి గర్భంలో తయారయ్యే శరీరంలో ప్రవేశపెడుతుంది.

ఎప్పుడైతే అంశాత్మ శరీరంలో ప్రవేశించిందో మీరు జీవుడు లేదా జీవాత్మ అవుతారు. అంతేకాదు “నువ్వు నాలా తయారవ్వాలి” అనే లక్ష్యాన్ని నిర్దేశించి, కర్మ చక్రంలో మిమ్మల్ని పూర్ణాత్మ ప్రవేశపెడుతుంది.

అలా తొమ్మిది మాసాలు పూర్తయిన తర్వాత తల్లి గర్భం నుంచి బయటకు వచ్చి ఎదుగుతూ ఉంటారు. ప్రారంభ జన్మలో కర్మలు ఏమి ఉండవు. అప్పటినుంచి కర్మలు చేయడం మొదలెడతారు. అలా ఎదిగే కొద్దీ ఎన్నో కర్మలు చేస్తూ కర్మ బంధంలో చిక్కుకుపోతారు.

ఈ కర్మ బంధంలో నుంచి బయట పడితే కానీ లక్ష్యాన్ని సాధించలేడు, పూర్ణాత్మను చేరలేడు, పూర్ణాత్మ స్థాయికి ఎదగలేడు. వీడు ఎప్పుడైతే ఈ కర్మ బంధం నుంచి బయటపడి పూర్ణాత్మ స్థాయికి ఎదుగుతాడో వాడికి ఇంక జన్మే ఉండదు.

ఇక్కడ కర్మ బంధం అంటే తెలుసు కుందాం. కర్మలు మూడు రకాలు, అవి ఆగామి కర్మలు, సంచిత కర్మలు, ప్రారబ్ధ కర్మలు. ఆగామి కర్మలు అంటే ప్రారంభ జన్మలో కర్మలు చేయడం మొదలు పెడతాడు. ఎందుకంటే ఈ మాయా ప్రపంచంలో ఉన్న ఎన్నో ఆకర్షణలు చూస్తూ అవి అన్ని పొందాలని, ఎన్నో సుఖాలు, సరదాలు, భోగాలు పొందటం కోసం

ఎన్నో కర్మలు చేస్తాడు, అలా చేసిన కర్మలు వాడి ఖాతాలో పడతాయి.

ప్రారంభ జన్మలో అలా కర్మలు చేయడమే కాదు వాటిలో కొన్ని కర్మలు అనుభవిస్తాడు కూడా. చివరికి వాడు చనిపోయే సరికి కొన్ని కర్మలు మిగిలిపోతాయి. అలా మిగిలిన కర్మలు వీడి ఖాతాలో జమ అవుతాయి, ఆ కాతానే ఆకాశక్ రికార్డ్స్ అంటారు. అందులో ఉన్న కర్మల్ని సంచిత కర్మలు అంటారు.

ఆపై లోకాలలో వాడికి కౌన్సిలింగ్ జరుగుతుంది, వాళ్ళు ఏమంటారంటే? “నాయనా నీకు ఒక లక్ష్యం నిర్దేశించబడింది, నువ్వు పూర్ణాత్మ కావాలి దానికి కర్మ చక్రం నుంచి నువ్వు బయట పడాలి. నువ్వు కర్మ చక్రంలో నుంచి బయట పడాలి అంటే నీ ఖాతాలో, కర్మలన్నీ రద్దు చేసుకుంటే నీ లక్ష్యాన్ని సాధిస్తావు, అంటే మోక్షాన్ని పొందగలుగుతావు” అని చెప్తారు.

అప్పుడు వాడు “ఈ కర్మ చక్రము నుండి నేను ఎలా బయటపడాలని” అడుగుతాడు. అప్పుడు ఆపై లోకవాసులు “నాయనా నువ్వేదో ఇప్పటిదాకా సుఖాలు, భోగాలు అనుభవించి కర్మలు చేస్తూ వచ్చావు. కనీసం ఈసారైనా వెళ్ళి సుఖాలు, భోగాలు అనుభవించడం కాదు, నువ్వు వెళ్ళి ధ్యానం చేసి జ్ఞానం సంపాదించు, ఆ జ్ఞానం అగ్నిలా ప్రజ్వరిల్ల చేసుకుంటే నీ ఖాతాలో ఉన్న కర్మలన్నీ పూర్తిగా దగ్ధమై పోతాయి. కర్మలు లేని స్థితి నువ్వు పొందుతావు, అప్పుడు నీకు మోక్షం లభిస్తుంది” అని చెప్తారు.

ఓహో అలా అయితే నాకు మళ్ళీ ఇంకో శరీరం ఇవ్వండి అని అడుగుతాడు. శరీరం తీసుకోవాలంటే నాయనా ఇప్పుడు నీ ఖాతాలో కొన్ని కర్మలు ఉన్నాయి, అందులో కొన్ని అనుభవించావు కానీ కొన్ని అనుభవించలేదు అని చెప్పి వాడిని ఆకాశక్ రికార్డ్స్ రూమ్లోకి పంపించి అనుభవించాల్సిన కర్మలన్నీ చూపిస్తారు.

అలా చూపించినప్పుడు అందులో కొన్ని సెలెక్ట్ చేసుకుంటాడు.

దానికి అనుకూలమైనటువంటి శరీరం వాడికి అలాట్ చేయబడుతుంది. అప్పుడు ఆ తల్లి గర్భం వాడికి కేటాయించ బడుతుంది. ఆ గర్భంలో ప్రవేశించి మళ్ళీ జన్మ తీసుకొని భూమి మీదకి వస్తాడు, విచిత్రం ఏమిటంటే వచ్చిన తర్వాత ఆ పైన నిర్ణయించుకున్నవన్నీ మర్చిపోతాడు.

ఆ జన్మ తీసుకున్నాక వాడి మీద తల్లిదండ్రుల యొక్క ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అప్పుడు తల్లిదండ్రులు ఏది చెప్తే అది రైట్ అనుకుంటాడు. వాళ్ళు ఎలా చెప్తే అలా చేయాలనుకుంటాడు. వాళ్ళు మనం హిందువులం మనం గుడికి వెళ్ళాలి, మన దేవుడు కృష్ణుడు, మన దేవుడు శివుడు ఇలా చెప్తారు. వాళ్ళని పూజిస్తే మన కోరికలు తీరుతాయి, కష్టాలు పోతాయి ఇలా ఎన్నో చెప్తారు. లేదంటే మనం క్రిస్టియన్స్, మనం చర్చికి వెళ్ళాలి, మనం ప్రార్థిస్తే ఆ జీసస్ మనల్ని కాపాడతాడు అని కొంతమంది చెప్తారు.

అప్పుడు అనుకుంటాడు "ఓహో నేను హిందువునా అని కానీ వచ్చినవాడు 'ఆత్మ' ఆ తల్లి శరీరంలో ప్రవేశించాడు కాబట్టి, వాళ్ళు చెప్పారు కాబట్టి ఓహో నేను హిందువునే అని అనుకుంటాడు, అదే నువ్వు క్రిస్టియన్ అని చెప్తే నేను క్రిస్టియన్ అని అనుకుంటాడు కానీ వాడు క్రిస్టియన్ కాదు, హిందువు కాదు, వాడు ఆత్మ.

సరే హిందువు అనుకుంటే హిందువుగా జీవితాన్ని సాగిస్తూ ఉంటాడు. మరలా ఈ భోగాలు, ఈ సుఖాలు అన్నింటికీ బానిసై చేయకూడని పనులు చేస్తూ ఉంటాడు. ఇంకా ప్రక్క వాళ్ళతో కంపేర్ చేసుకుంటూ వాడికి పెద్ద ఇల్లు ఉంది, వాడికి పెద్ద కారు ఉంది అని ఎదుటి వారితో కంపేర్ చేసుకొని వాటన్నిటిని సమకూర్చుకోవడం కోసం డబ్బులు అవసరం కాబట్టి ఆ డబ్బులు సంపాదించడం కోసం ఎన్నో తప్పులు, పాపాలు చేస్తాడు. ఎన్నో కర్మలు మూటగట్టుకొంటాడు, అలా చేసిన కర్మలన్నీ వాడి ఖాతాలో

పడిపోతాయి.

అలా కొన్నాళ్ళకి ముసలితనం వస్తుంది. భూమ్మీద సంపాదించినవన్నీ వదిలేసి పైకి వెళ్లాల్సి వస్తుంది. పైకి వెళ్లేటప్పుడు వీడు సంపాదించింది ఏది వాడితో రాదు కానీ వాడు చేసిన ఆ పాప కర్మలు మటుకు వస్తాయి. అవి సంచిత కర్మల్లో కలుస్తాయి, మళ్ళీ మామూలే! కౌన్సిలింగులో మళ్ళీ వాళ్ళన్నీ చెప్పడం, మరలా జన్మ తీసుకోవడం, ఆ జన్మలో కూడా మరలా కొన్ని కర్మలు తెచ్చుకోవడం ఇలా జరుగుతూ ఉంటుంది.

సహజంగా ఈ విషయాలన్నీ ఎంత చెప్పినా ప్రారంభంలో ఎక్కదు, కారణం ప్రారంభ జన్మల్లో కష్టాలు ఎక్కువ ఉండవు; ఎందుకంటే పాప కర్మలు ఎక్కువగా ఉండవు కాబట్టి. ఈ కర్మలు రద్దు చేసుకోవాలనేటువంటి ఆలోచన ఉండదు. ఇలా 150 నుండి 300 జన్మల దాకా గడిచిపోతుంది. ఇలా ఎన్నో కర్మలు పెరిగిపోతూ చివరకు వాడి ఖాతాలో కొండంత కర్మలు పెరిగిపోయాయి. అన్ని కర్మలు పెరగడం వల్ల వాడి జీవితం ఎప్పుడూ దుఃఖంలోనే ఉంటుంది, ఎప్పుడూ కష్టాలే. సంసారంలో కష్టాలు, ఆర్థికంగా కష్టాలు, ఆరోగ్యపరంగా కష్టాలు, ఇరుగుపొరుగు వారితో కష్టాలు, వార్ధక్యంలో కష్టాలు అవన్నీ భరించ లేకపోతూ ఉంటాడు. కర్మలు పెరిగే కొద్ది కష్టాలు పెరిగిపోతాయి కాబట్టి ఏం చేయాలో అర్థం కాక మొదట్లో దేవుళ్ళని ఆశ్రయిస్తాడు.

అలా ఎన్ని పూజలు చేసినా, ఎన్ని వ్రతాలు చేసినా, ఎంత మంది దగ్గరకు వెళ్ళినా ఏమి ఉపయోగం లేదు అని తెలుసుకున్నప్పుడు ఒక సద్గురువుని ఆశ్రయిస్తాడు.

అప్పుడు ఆ సద్గురువు "నువ్వు చేసిన కర్మలను బట్టే ఈ కష్టాలు వస్తున్నాయి నాయనా! ఈ సృష్టిలో నీ పేరు మీద ఒక అకౌంట్ ఉంది, అందులో ఇన్ని జన్మల నుంచి నువ్వు చేసిన కర్మలన్నీ రికార్డు అయి ఉన్నాయి, ఆ కర్మలు ఉన్నంత కాలము నువ్వు జన్మ తీసుకోవాల్సిందే, నువ్వు ఏవో కొన్ని

కర్మలు తెచ్చుకొని వాటిని అనుభవించి ఆ కర్మలు లేకుండా చేసుకున్నాను అని అనుకుంటున్నావు కానీ జన్మలు పెరిగే కొద్దీ నీ అకౌంట్‌లో కర్మలు పెరిగిపోతున్నాయి, నువ్వు ఎన్ని కర్మ తెచ్చుకొని అనుభవిస్తున్నా కర్మలు పూర్తి అవ్వవు" అని చెబుతాడు.

అప్పుడు ఆ గురువు గారిని అడుగుతాడు మరి నేను కర్మలు లేకుండా చేసుకోవాలంటే ఎలా? ఆ మోక్షం పొందాలంటే ఎలా? జన్మ లేకుండా ఎలా చేసుకోవాలి? అని సద్గురువుని అడిగితే అప్పుడు ఆ సద్గురువు చెప్తాడు "ఏమి లేదు నాయనా దానికి ఒక తేలికైన మార్గం ఉంది, నువ్వు ఏదో అనుభవించి రద్దు చేసుకోవాలంటే ఇంకో వెయ్యి జన్మలు ఎత్తినా నీకు అవి రద్దు కావు, ఈ జన్మ బంధంలో నుంచి నువ్వు బయట పడలేవు, ఈ జనన మరణ చక్రం నుంచి నువ్వు బయట పడలేవు, దానికి నువ్వు చేయవలసింది శ్రీకృష్ణ భగవానుడు చెప్పినట్టు ఆ కర్మలన్నీ దగ్ధమయ్యే జ్ఞానాన్ని సంపాదించుకో" అని సద్గురువు చెబుతాడు.

అప్పుడు వాడు ఆ సద్గురువుని ఆశ్రయించి, స్వామి మరి ఆ జ్ఞానం ఎలా వస్తుంది? కాస్త నాకు బోధించండి, నేను జ్ఞానాన్ని పెంచుకొని ఆ కర్మలను దగ్గం చేసుకొని, ఈ కర్మ చక్రం నుంచి బయటపడి మోక్షాన్ని పొందుతాను అంటాడు.

అప్పుడు ఆ గురువు చెప్తాడు "నాయనా జ్ఞానం పొందాలి అంటే అంత తేలికేం కాదు, దానికి "శ్వాస మీద ధ్యాస" పెట్టి తీవ్రాతి తీవ్రమైన ధ్యానం చేయాలి, అలానే జ్ఞానులు వ్రాసిన జ్ఞానవంతమైన పుస్తకాలు అంటే ఆత్మ జ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు చదవాలి, సాత్వికమైన శాకాహారం తీసుకోవాలి ఇవన్నీ పాటించినప్పుడు నీ జ్ఞానం పెరిగి నీ కర్మలను దగ్ధం చేసుకోగలవు. ఈ బాధల్లో నుంచి, ఈ దుఃఖంలో నుంచి, ఈ సమస్యలో నుంచి, ఈ నరకంలో నుంచి శాశ్వతంగా బయట పడతావు అని చెబుతారు.

దీనిని బట్టి ప్రతిఒక్కరూ జ్ఞానవంతమైన పుస్తకాల ద్వారా జ్ఞానం సంపాదించుకోవాలి . అలాగే ఆత్మజ్ఞానం బోధించే గురువుగారి సందేశాలు రోజు వినడానికి ప్రయత్నించాలి. కొంతమంది ఆశ్రమాలకి వెళ్లి ఆ గురువుల సందేశాలు వింటూ ఉంటారు. కొంతమంది హిమాలయాలకి వెళ్లి అక్కడ ఎవరైనా గురువు దొరికితే వాళ్ళని ఆశ్రయించి వాళ్ళ ద్వారా జ్ఞానాన్ని పొందుతారు. కొంతమంది సంసారంలో ఉంటూనే సద్గురువును పట్టుకొని ఆ జ్ఞానం పెంచుకునే ప్రయత్నం చేస్తారు. మరి అలాగే ఇప్పుడు మీకు కూడా అటువంటి సాంగత్యం, అటువంటి సాధన, అటువంటి స్వాధ్యాయం చేయడానికి అద్భుతమైన అవకాశం భీమవరంలో జరిగే "మూడు రోజుల ధ్యాన" యజ్ఞంలో లభించింది.

నిజంగా ఇంతటి అవకాశం ఎక్కడా లేదు. అటువంటి అవకాశం మీకు దొరికింది. ఇది అర్థం చేసుకున్నవాడు, ఈ జ్ఞానం యొక్క గొప్పతనం తెలుసుకున్నవాడు జ్ఞానం అగ్నిలా ప్రజ్వరిల్లి నప్పుడే కర్మలు దగ్ధం అవుతాయి అని తెలుసుకున్నవాడు, ప్రతి నెలా భీమవరం వస్తాడు.

భీమవరంలో నేను కానీ, మేడమ్ కానీ చెప్పిన ప్రతి విషయాన్ని అర్థం చేసుకొని, పాటిస్తూ జ్ఞానాన్ని పెంచుకున్నవాడు ఎంతో అదృష్టవంతుడు. ఈ జన్మలోనే తీవ్రంగా ధ్యానం చేసి, జ్ఞానాన్ని సంపాదించుకుంటే మీ కర్మలన్నీ దగ్ధమైపోతాయి. ఏ కర్మల వల్ల జన్మ చక్రంలో పడి నలిగిపోతున్నారో! ఆ కర్మలన్నీ దగ్ధమైపోతాయి. మరి కర్మలే లేకపోతే జన్మ ఉండదు, దాన్నే మోక్షం అని అంటారు.

అందుచేత గుర్తుపెట్టుకోండి "కర్మ బంధం నుండి బయట పడటమే మోక్షము" అంటారు. అందరూ ఈ కర్మలనే బంధంలో చిక్కుకున్నారు, బంధించబడి ఉన్నారు, ఒక్క కర్మ ఉన్నా బంధంలో ఉన్నట్టే, కర్మలే లేకపోతే బంధమే లేదు, అదే మోక్షం.

అందుకే రాజ్యలక్ష్మి మేడం కానీ, నేను కానీ ప్రతి ఊరు తిరిగి ఈ విషయాలే బోధిస్తున్నాం. పూర్వ కాలం గురువుల దగ్గరకి శిష్యులు వెళ్ళి జ్ఞానం నేర్చుకునేవారు కానీ ఇప్పుడు మీ అందరి దగ్గరికి వెళ్ళి జ్ఞానం బోధిస్తున్నాం, పత్రి గారిని ఆదర్శంగా తీసుకొని ఆ పని చేస్తున్నాము.

అందుచేత మీరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోండి, బద్దకించకండి, బద్ధకిస్తే బాధలు తప్పవు, **"జ్ఞానం పొందడానికి మీరు ఎంత బద్దకిస్తే అజ్ఞానంలో ఉండి అంత బాధపడాల్సిందే, దుఃఖపడాల్సిందే".** మరి వాటి నుండి బయట పడాలి అంటే జ్ఞానం పొందవలసిందే.

భీమవరం మూడు రోజులు క్లాసు ఎటువంటి పరిస్థితులో మానకండి, అలానే ప్రతి రోజు ఉదయం జరిగే జూమ్ క్లాస్ లు కూడా మానకండి. భీమవరంలో గంటలు గంటలు ధ్యానం చేయడం వలన ఎంతో శక్తిని పొందుతారు, అలాగే ప్రతిరోజు సునాయాసంగా ఎన్నో గంటలు ధ్యానం చేయగలుగుతారు. ప్రతి రోజు జూమ్ క్లాస్ లో పాల్గొంటే ఎన్నో జ్ఞానవంతమైన విషయాలు తెలుసుకుంటారు అలా ధ్యానం చేస్తూ, ప్రతి రోజు మెల్లి మెల్లిగా జ్ఞానాన్ని పెంచుకుంటే కర్మలు తగ్గిపోతూ ఉంటాయి. కొండంత కర్మలు కూడా రహితం చేసుకోగలరు. అలా కర్మలు దగ్ధం చేసుకుంటే మోక్షాన్ని పొందగలరు.

::9::

# “అవిచ్ఛిన్న ఆత్మానందానుభూతిని పొందుటయే మోక్షము”

విచ్ఛిన్నం అంటే నాశనం అయ్యేది. అవిచ్ఛిన్నం అంటే విచ్ఛిన్నం కానిది అంటే నాశనం కానిది. నిరంతరం అలాగే ఉండేది, శాశ్వతమైనది. ఏమిటి అంటే ఆత్మానందానుభూతి. ఇక్కడ ఆత్మానందము, అనుభూతి అనే రెండు పదాలు కనిపిస్తున్నాయి.

ఆత్మానందం అంటే ఏమిటో తెలుసుకుందాం. ఏ మానవుడైనా సరే మూడు రకాలుగా అనుభవిస్తాడు. అవే సుఖము, సంతోషము, ఆనందము. సుఖము అన్నది శరీరానికి సంబంధించింది, సంతోషం అన్నది మనసుకు సంబంధించింది, ఆనందము అన్నది ఆత్మకు సంబంధించింది.

ఈ ఆత్మానందం ఎంత గొప్పది అంటే అది అనుభవిస్తున్నవాడు, దాంట్లో నుంచి బయట పడడం కష్టం, అది అనిర్వచనీయమైనది అంటే దాన్ని నిర్వచించ లేరు, చెప్పలేరు. ఆ ఆనందాన్ను అనుభూతి చెందాల్సిందే కానీ ఇతరులకు చెప్పలేరు.

ఉదాహరణకు మీరు చూడండి ఒకడు మామిడి పండు తిన్నాడు, అది ఎంత మధురంగా ఉంది అంటే మర్చిపోలేక పోతున్నాడు, అంత రుచిగా ఉంది. ఇతరులు చెప్పమని అడుగుతారు.  అంటే జిలేబీలా ఉందంటాడు, జిలేబీ రుచి ఎలా ఉంటుంది అంటే మైసూర్  పాక్ లా అంటాడు. ఇలా చెప్తాడు అంతేకానీ దాని రుచి  ఎక్కడ చెప్పగలడు? అందుకే నువ్వు తింటే నీకు తెలుస్తుంది, నేను చెప్తే, నువ్వు వింటే ఏం తెలుస్తుంది అని అంటాడు.

అంత గొప్ప ఆత్మానందానుభూతి సహజంగా ధ్యాన స్థితిలో పొందుతారు అంటే ఎవరైతే కళ్ళు మూసుకుని “శ్వాస మీద ధ్యాస” ఉంచి ధ్యానం చేస్తారో వారికి కాసేపటికి ఆలోచనలన్నీ ఆగిపోతాయి, అక్కడ మనసు కూడా ఉండదు, ఇంక ఉండేది ఆత్మ. ఆత్మ యొక్క లక్షణం  సచ్చిదానందం.

ఆ ధ్యాన స్థితిలో అటువంటి ఆనందం అనుభవిస్తూ ఉంటాడు. అప్పుడు వాడికి గంటలు నిమిషాల్లా గడిచిపోతూ ఉంటాయి. అందుకే భీమవరం వచ్చినవారు ఎన్ని గంటలైనా సునాయాసంగా కూర్చుంటున్నారు, కొత్త వాళ్ళు కూడా  కూర్చోగలుగుతున్నారు.

అలా మూడు గంటలు కూర్చొబెట్టినా, ఐదు గంటలు కూర్చొబెట్టినా, ఆరు గంటలు కూర్చిపెట్టినా లెక్క చేయరు. అరే అప్పుడే అంత టైమ్ అయిపోయిందా? అని ఆశ్చర్యపోతారు. అందుకే ఇప్పుడు మన వాళ్ళంతా ఉదయం ఐదింటికి కూర్చోమంటే నాలుగింటికి, మూడింటికి, రెండింటికి కూడా కూర్చొనే వాళ్ళు ఎంతో మంది ఉన్నారు. ఎందుకంటే ఆ ఆత్మానందాన్ని అనుభవిస్తున్నారు. అంటే ఆత్మానుభూతి చెందుతున్నారు. ఆ స్థితిలో ఉన్నవారు లేవాలన్న లేవలేరు.

ఇటువంటి స్థితి మీకు గాఢ నిద్రపోయేటప్పుడు కూడా కలుగుతుంది, అదే సుషుప్తి అవస్థ. ఈ సుషుప్తి అవస్థలో మనసు దాటి ఆత్మతో ఉంటారు. అందుకే ఆ సుషుప్తి అవస్థని గాఢ నిద్రావస్థ అంటారు. మీరు ధ్యానం చేసేటప్పుడు ఆ స్థితికి వస్తే ఎన్ని గంటలు ఎలా కూర్చుంటారో నిద్రలో కూడా జాగ్రతావస్థ, స్వప్నావస్థ దాటిపోయి ఆ సుషుప్తి అవస్థలో ఆత్మతో మీరు ఉన్నప్పుడు, ఆ గాఢ నిద్రలో మీరు ఉన్నప్పుడు గంటలు నిమిషాలులా గడిచిపోతాయి. మీరు ఇన్ని గంటలు కూర్చోవాలని అంటే 4 గంటలు కానీ 5 గంటలు కానీ ముందే నిర్ణయించుకుంటే ఖచ్చితంగా అన్ని గంటలు కూర్చోగలుగుతారు.

భగవద్గీతలో శ్రీకృష్ణుల వారు చెప్పారు కదండి "యద్భావం తద్భవతి" అని, అందుచేత మీరు ఏది అనుకుంటే అది జరుగుతుంది. అందుచేత  మీరు టైమ్ లిమిట్ పెట్టుకోకండి.

అందుచేత మీరు రాత్రి పూట గంటలు గంటలు ధ్యానం చేసి అపారమైన శక్తిని సంపాదించుకోండి,  "అవిచ్ఛిన్నమైనటువంటి ఆత్మానందాన్ని

అనుభూతి చెందుతారు.

మరి యోగులు, బాలయోగులు రోజులే కాదు, నెలలు తరబడి కూర్చుంటున్నారు, సంవత్సరాలు తరబడి కూడా ఆ ధ్యాన స్థితిలో ఉంటున్నారు. ఎందుచేతనంటే వాళ్ళు ఆత్మతో ఉన్నటువంటి ఆ స్థితిలో అనిర్వచనీయమైన ఆనందాన్ని, అనుభవిస్తున్నారు, ఆత్మానందానుభూతిని పొందుతున్నారు. వర్ణించ వీలు లేనిది కాబట్టి అలా ఉండిపోతారు. భగవంతునితో అలా ఉండిపోయిన స్థితినే సమాధి స్థితి అంటారు. ఆ స్థితిలో వాళ్ళు పొందే ఆనందం ఎంత గొప్పదో అర్థం అయితే ఈ అల్పమైన సుఖ, సంతోషాల కోసం తప్పులు, పాపాలు చెయ్యరు.

సహజంగా మానవులకు ఇటువంటి ఆనంద స్థితి ఇంకొక సందర్భంలో కూడా కలుగుతుంది. అది భార్యా భర్తలు సంభోగ సమయంలో పొందుతారు. అందుకే స్త్రీ, పురుషులు వివాహం చేసుకోవడానికి కారణం. అంత గొప్ప ఆనంద స్థితి పొందడానికే పగలంతా భార్యాభర్తలిద్దరూ ఎంతో కష్టపడతారు. ఎందుకు అంటే ఆ నిమిషకాలం పొందే ఆనందం కోసం.

కానీ భార్యా భర్తలు సంభోగ సమయంలో ఒక నిమిష కాలం పొందే ఆనందానుభూతిని యోగులు ధ్యాన స్థితిలో శాశ్వతంగా పొందుతూ ఉంటారు.

అటువంటి ఆనందస్థితి పొందుతున్న యోగులు ఆ స్థితి నుండి బయటకు రావాలన్నా రాలేరు. అటువంటి స్థితి పొందినవారు మోక్షాన్ని పొందినట్టే. అందుకే **"అవిచ్ఛిన్న ఆత్మానందానుభూతి పొందడమే మోక్షము అని చెప్పబడింది".**

మరి రమణ మహర్షి గారు కూడా ఆ సమాధి స్థితిలో ఆనందాన్ని అనుభవిస్తూ ఉండిపోయారు. ఆయన ఒంటికి చెదలు పట్టినా ఆయనకు ఏం తెలియలేదట. అలా ఎంతో మంది యోగులు ఆ స్థితికి చేరుకున్నారు. మనందరి ప్రయత్నం కూడా అదే. అలా అంతులేని అవిచ్ఛిన్నమైన ఆత్మానందానుభూతిని నిరంతరం, శాశ్వతంగా పొందడమే మోక్షం.

::10::

# "జనన మరణ చక్రం నుండి బయట పడడమే మోక్షం"

ఇక్కడ ఒక్క విషయం మీరు అవగాహన చేసుకోవాలి, అసలు ఈ జన్మ తీసుకున్నది దేనికి అంటే మరల జన్మ లేకుండా చేసుకోవడానికి. ఇది అర్థం కాని వారు, అవగాహన లేని వారు ఏమనుకుంటారంటే ఈ జన్మ అన్నది ఎంజాయ్ చేయడానికి అనుకుంటారు.

మరి అలా ఎంజాయ్ చేయాలి అంటే ధనం కావాలి. అందుచేత మానవులు కష్టపడి డబ్బు సంపాదిస్తున్నారు, ఆ డబ్బుతో అన్నీ సమకూర్చుకుని సుఖాలు అనుభవించడానికి ప్రయత్నిస్తున్నారు. ఎవరిని చూసినా వారి జీవితంలో ఎక్కువ సమయం ధన సంపాదనకే కేటాయిస్తున్నారు. సుఖపడడానికి కావలసిన సంపాదన సరిపోదని భార్యా భర్తలు ఇద్దరూ కూడా సంపాదిస్తున్నారు. కొంతమంది రిటైర్ అయ్యే వరకు సంపాదిస్తుంటారు, ఇంకా కొంతమంది రిటైర్ అయిన తర్వాత కూడా వారి శక్తి సన్నగిల్లే వరకు సంపాదిస్తూనే ఉంటారు.

అలా జీవితమంతా సంపాదించడానికి, అనుభవించడానికే వినియోగిస్తున్నారు. అంతేకాదు ఎంత ఎక్కువ సంపాదిస్తే లోకంలో అంత గొప్ప వారు అయిపోవచ్చు అని అనుకుంటారు. ఇంకా పిల్లల బాగోగుల కోసం అని, పిల్లల చదువుల కోసమని సంపాదిస్తూనే ఉంటారు. వారి పిల్లలే కాదు మనవళ్ళు, మనవరాళ్ళ కోసం కూడా చనిపోయే వరకు సంపాదిస్తూనే ఉంటారు.

మానవుడికి ఇవ్వబడిన ఐదు ఇంద్రియాలతో సుఖాలు అనుభవించాలంటే ఎన్ని సమకూర్చుకోవాలో చెప్పండి. ఈ కళ్లతో ఎన్ని ప్రదేశాలు చూడాలి? ఎన్ని విహార యాత్రలు చేయాలి? ఈ భారతదేశంలోనే కాదు విదేశాలకు కూడా తిరుగుతుంటారు. దేనికి అంటే సంపాదించుకున్నది

అనుభవించడానికి, ఎంజాయ్ చేస్తూ ఎవరూ చూడనన్ని ప్రదేశాలు చూడాలి అనుకుంటారు.

కొంతమంది సంగీతం వినాలని మంచి పాటలు వినాలని ఇంటిలో ఎన్నో అమర్చుకుంటారు, అలా వింటూ మైమరిచిపోతూ ఉంటారు. ఇంకా విలాసవంతంగా బ్రతకటానికి వారి ఇంటిని ఎంతో ఖర్చు పెట్టి డెకరేట్ చేసుకుంటారు, సుఖంగా జీవించడానికి ప్రతి గదిలోనూ అన్ని ఏర్పాట్లు చేసుకుంటారు, ఏసి లు, మెత్తటి పరుపులు ఇలా ఎన్నో సమకూర్చుకుంటారు.

ఇంకా రకరకాల పదార్థాలు తినడానికి ప్రతి పూట ఎన్నో రకాల ఆహారపదార్థాలు చేసుకుంటారు, మాంసాహార పదార్థాలు కూడా తింటుంటారు, అన్ని రకాల జంతువులను, పక్షులను తింటూ ఉంటారు. చైనా లాంటి దేశాలలో అయితే నేల మీద పాకే జంతువులను, క్రిమికీటకాలను, పాములను ఇలాంటి ఎన్నో రకాల జీవులను తింటుంటారు. కూరగాయలను పండించినట్టు వాటిని కూడా ఫామ్స్ లో పెంచి తింటుంటారు. అలానే ఇంకా కొంతమంది మద్యపానం చేస్తారు. ఇన్ని రకాలుగా ఎంజాయ్ చేయడానికి ప్రకృతి సమకూర్చింది. కాని ఇవన్నీ దేహాన్ని సుఖపెట్టే ప్రక్రియలే, వీటినే భౌతిక సుఖాలు అంటారు.

ఇలా ప్రతి ఒక్కరూ తాను, తన కుటుంబం మొత్తం ఏ లోటు లేకుండా జీవిస్తే అదే జీవితం అనుకుంటారు. అలా సుఖంగా జీవించటానికి తాను సంపాదించింది సరిపోక అడ్డ మార్గాల ద్వారా అధర్మంగా సంపాదిస్తుంటారు, ఇతరులను మోసం చేస్తూ ఉంటారు, ఇతర జీవులతో వ్యాపారం చేస్తూ ఉంటారు, పాపాలు చేస్తారు. వీటన్నిటి వలన ఎన్నో కష్టాలు, బాధలు, రోగాలు అనుభవిస్తూ చివరికి వారి జీవితం నరకంలా తయారవుతుంది. ఎన్నో హాస్పిటల్స్ తిరుగుతారు, ఎంతోమంది దేవుళ్లకు మొక్కుతుంటారు, ఎంతో మంది గురువులను ఆశ్రయిస్తారు.

ఆ భౌతిక సుఖాల మీద, భోగాల మీద వ్యామోహంతో కష్టాలు తెచ్చుకుంటారు, వాటిని అనుభవిస్తూ ఉంటారు, వాటి నుంచి బయటపడే ప్రయత్నం చేస్తూ ఉంటారు, జీవితమంటే ఇంతే కదా! ఇంకేమి లేదు అనుకుంటారు.

ఈ భౌతిక సుఖాల కోసం చేయకూడని పనులు చేయడం వల్ల, పాపాలు చేయడం వల్ల ఎక్కువ కష్టాలే ఉంటాయి. ప్రశాంతంగా జీవించలేరు? అలా అందరికీ డబ్బు ఉంది కానీ ఎవరికీ ప్రశాంతత లేదు.

అలా 300 నుండి 350 జన్మలు తీసుకున్నాక వారిలో ఆలోచన మొదలవుతుంది,అసలు ఏంటి ఈ జీవితం? నేను ఎందుకు పుట్టాను? దేని కోసం పుట్టాను? ఏం సాధించడానికి, ఏం చేయడానికి పుట్టాను? అసలు నేనెవరు? దేవుడు నన్నెందుకు సృష్టించాడు? ఎందుకు నన్ను బాధ పెడుతున్నాడు? అని ఇలాంటి ప్రశ్నలన్నీ వస్తాయి. అటువంటి సమయంలోనే ఒక సద్గురువుని ఆశ్రయిస్తారు.

అప్పుడు ఆ సద్గురువు “నాయనా నువ్వు జన్మ తీసుకున్నావు అంటే దుఃఖం తప్పదు, బాధలు తప్పవు. ఈ భోగాలు, సుఖాలు అనుభవిస్తున్నాను అని అనుకుంటున్నావు, నీ భార్య, పిల్లల మీద మమకారాన్ని పెంచుకుని వారి కోసమే జీవితం అని అనుకుంటున్నావు. కానీ ఈ జన్మ అన్నది జన్మ లేకుండా చేసుకోవడానికి” అని భోదిస్తాడు.


అలా సద్గురువుని ఆశ్రయించే స్థాయికి వెళ్లారు అంటే 350 జన్మలు దాటవలసిందే. ఆ సద్గురువు ఇంకా ఏమి చెబుతాడంటే నాయనా ఈ పుట్టడం, చావటం ఎన్నో జన్మల నుంచి నీకు జరుగుతుంది, నువ్వు జ్ఞానం సంపాదించుకుని కర్మలన్నీ రహితం చేసుకుంటే నీకు జన్మ అంటూ ఉండదు, నీవు జనన మరణ చక్రం నుంచి బయట పడతావు అని చెప్తారు.

అప్పుడు ఆ సద్గురువులు చెప్పిన విధంగా జ్ఞానాన్ని పొందుతూ, ఆ

జ్ఞానం పెంచుకుంటూ వారి కర్మలను రహితం చేసుకుంటూ జనన మరణ చక్రం నుంచి బయటపడే ప్రయత్నం చేస్తారు, అంటే జన్మ లేని స్థితి సంపాదించుకుంటారు, దాన్నే 'మోక్షము' అని కూడా అంటారు.

అందుచేత ఎవ్వరైనా సరే "జన్మ తీసుకున్నది జన్మ లేకుండా చేసుకోవడానికే", కానీ నా పిల్లలు అని, నా ఆస్తి అని మమకారంతో ఉంటే జన్మలు తప్పవు. ఇంతకుముందు ఎన్నో జన్మల్లో అనుభవించారు, ఇంకేం అనుభవిస్తారు? అందుచేత ఈ జనన మరణ చక్రం నుంచి బయట పడండి అంటే జ్ఞానం సంపాదించుకోండి.

ఆ పనే ఇప్పుడు మీరందరూ చేస్తున్నారు. అందుకే మీరందరూ కూడా చివరి జన్మలకు వచ్చిన వారే. అందుకే ఇంకా కష్టపడి జ్ఞానం పొంది ఈ జన్మే చివర జన్మ చేసుకోండి, మోక్షాన్ని పొందండి.



::11::

# “మానవుని లక్ష్యమైన పూర్ణాత్మగా ఎదగడమే మోక్షం”

మోక్షం గురించి మనం ఎన్నో పాయింట్లు చెప్పుకున్నాం. కర్మ బంధం నుంచి బయట పడటం అని, చావు పుట్టుకలు లేకుండా చేసుకోవడం అని ఇలా చాలా విషయాలు చెప్పుకున్నాం.

అంటే మోక్షం అనేది మానవుడికి నిర్దేశించబడిన లక్ష్యాన్ని సాధించినప్పుడు పొందగలుగుతాడు. ఆ లక్ష్యం పూర్ణాత్మ కావడం. కాని ఆ పూర్ణాత్మ కావడం అన్నది అంత తేలిక కాదు. ఎన్నో జన్మల నిరంతర కృషి ఫలితంగా మాత్రమే ఆ స్థితికి చేరుకోగలరు.

చూడండి ఎవరైనా సరే ఒక లక్ష్యాన్ని సాదించాలి అంటే ఆ లక్ష్యం మీద తదేక దృష్టి కేంద్రీకరించినప్పుడే  సాధించగలరు.

పురాణాల్లో చూసుకుంటే  ద్రోణాచార్యుల వారు తన శిష్యులైన పాండవులకి, కౌరవులకి ఒక చెట్టు మీద ఉన్న పక్షి యొక్క కను గుడ్డు ఛేదించాలని ఒక లక్ష్యాన్ని నిర్దేశిస్తాడు. ఒక్కొక్కరిని పిలిచి నీకు ఏం కనిపిస్తుంది? అంటే చెట్టు కనిపిస్తుంది, కొమ్మ కనిపిస్తుంది, పక్షి కనిపిస్తోంది అని ఇలా రకరకాలుగా చెప్పారు. చివరకు అర్జునుడిని పిలిచి నీకు చెట్టు కనిపిస్తుందా అంటే లేదన్నాడు, కొమ్మ కనిపిస్తోందా అంటే లేదన్నాడు. ఆకులు కనిపిస్తున్నాయా అంటే లేదన్నాడు, పక్షి కనిపిస్తోందా అంటే లేదన్నాడు, మరి నీకు ఏమి కనిపిస్తుంది? అన్నాడు ద్రోణాచార్యులవారు. నా లక్ష్యం అయినటువంటి ఆ పక్షి కను గుడ్డు తప్ప నాకు ఇంకేమీ కనిపించట్లేదు అన్నాడు అర్జునుడు. సరే అయితే నువ్వు  సాధించగలవు అని ద్రోణాచార్యుల వారు అన్నారు. అప్పుడు అర్జునుడు తన లక్ష్యాన్ని సాధిస్తాడు. ఎందుకు అంటే దృష్టి తదేకంగా తన లక్ష్యం పైనే కేంద్రీకరించడం వల్ల సాధించగలిగాడు.

అలాగే ఏ మానవుడైనా తన లక్ష్యమైనటువంటి పూర్ణాత్మగా ఎదిగితేనే మోక్షాన్ని పొందుతాడు. అంటే వాడికి తన లక్ష్యమైనటువంటి పూర్ణాత్మ అవ్వాలనే తదేక దృష్టి ఉండాలి. అది తప్ప ఇంక దేని మీద దృష్టి ఉండకూడదు, అప్పుడు కచ్చితంగా ఆ లక్ష్యాన్ని సాధిస్తాడు, పూర్ణాత్మ అవుతాడు.

కానీ ఆ లక్ష్యాన్ని సాధించడం అంత తేలికైన విషయం కాదు. కారణం ఆ లక్ష్యం సాధించడానికి ఆ పూర్ణాత్మ మానవుడిని ఈ మాయా ప్రపంచంలో పంపించింది. ఈ మాయా ప్రపంచంలో ఎన్నో రకాల ఆకర్షణలు, ఎన్నో రకాల సుఖాలు, భోగాలు ఉంటాయి కాబట్టి వాటి వ్యామోహంలో పడిపోతాడు. వాటి యొక్క వ్యామోహం నుంచి బయట పడడం అంటే సామాన్యమైన విషయం కాదు, అంత ఆకర్షణగా ఉంటాయి.

ఈ మానవుడికి ఒక ఇంద్రియం కాదు ఐదు జ్ఞానేంద్రియాలు ఇవ్వబడ్డాయి. ఈ ఐదు జ్ఞానేంద్రియాలతో సకల సుఖాలు అనుభవించడానికి ఈ సృష్టిలో ఎన్నో రకాల ఏర్పాట్లు ఉన్నాయి. అందుచేత ఈ కళ్లతో ఎన్నో అద్భుతాలు చూసి వాటికి ఆకర్షితుడవుతాడు, ఈ చెవులతో ఎన్నో మధురమైన ధ్వనులను వింటూ, ఈ ముక్కుతో వాసనలు పీలుస్తూ, నోటితో ఎన్నో రకాల మధురమైన పదార్థాలు తింటూ, చర్మంతో సుఖపడే ఎన్నో రకాలైన సౌకర్యాలు అంటే ఏసీలను, ఫ్యాన్లను ఇలాంటివి ఎన్నో ఏర్పాటు చేసుకొని వాటి ఆకర్షణలకు లోనై తన లక్ష్యం మీద దృష్టి పెట్టలేకపోతున్నాడు.

బుద్ధుడి దగ్గర ఎన్నో మధురమైన పదార్థాలను ఎదురు గుండా పెడితే ఆయన పదార్థాల వంక చూసేవాడు కాదట, తన కడుపు వంక చూసుకునే వాడట. అంటే తన ఆకలిని బట్టి ఏదో ఒకటి మాత్రమే తినే వారట, కానీ ఎంత మధురమైన పదార్థాలు ఉన్నా వాటిని స్వీకరించే వారు కాదట. అంటే ఆయనకు ఈ మాయా ప్రపంచంలో ఉండే ఆకర్షణల మీద ఆయన దృష్టి ఉండేది కాదట.

అలాగే రమణ మహర్షి కూడా తాను వేసుకునే బట్టల మీద, తాను తినే ఆహారపదార్థాల మీద దృష్టి పెట్టే వారు కాదు. ఈ మాయా ప్రపంచంలో ఉండే ఏ ఆకర్షణకి ఆయన లోను కాలేదు, వాటినన్నిటిని లెక్కపెట్టేవాడు కాదు.

ఒకసారి రమణ మహర్షి గారి తల్లి ఇంకో కొడుకు దగ్గరికి వెళ్ళి నాలుగు రోజులు ఉండి వస్తాను అని చెప్పినప్పుడు, రమణ మహర్షి "ప్రాపంచిక ఆకర్షణ మీద దృష్టి పెట్టాలనుకుంటే నువ్వు వెళ్ళు, లేదా మోక్షం పొందాలి, జ్ఞానం పొందాలి అంటే ఇక్కడే ఉండు" అని అన్నారట. అప్పుడు ఆవిడ కాసేపు ఆలోచించి ఎక్కడికి వెళ్ళకుండా అక్కడే ఉండిపోయిందట.

ఇప్పుడు ఎంతో మంది ఈ మార్గంలోకి వస్తున్నారు, అన్ని విషయాలు తెలుసుకుంటున్నారు కానీ మమకారాలు వదలలేక పోతున్నారు. భార్య/ భర్త, పిల్లలు, ధనం ఇలా వీటన్నింటి మీద మమకారాన్ని వదలలేక పోతున్నారు. వారి సమయాన్ని, శక్తిని, వారికి ఉన్న శక్తులన్నింటినీ వాటి కోసమే త్యాగం చేస్తూ వారి లక్ష్యం ఏమిటో తెలుసుకోలేకపోతున్నారు. తమ లక్ష్యాన్ని సాధించ లేక మళ్లీ జన్మ తీసుకుంటున్నారు, ఇలా జనన మరణ చక్రంలో ఇరుక్కుపోయి మోక్షాన్ని పొందలేక పోతున్నారు.

ఇంకా కొంత మందిని చూసినట్లయితే ఈ మాయా ప్రపంచంలో ఉన్నటువంటి ఆకర్షణల వల్ల ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క రకమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుంటారు. తాను ఆత్మ అన్న సంగతి వాళ్ళకు తెలీదు, ఆత్మ అయిన తాను దేహం అనుకుని తన లక్ష్యమైన పూర్ణాత్మ కావడం అన్న సంగతి తెలుసుకోలేకపోతున్నారు.

ఈ దేహం నేను అనుకుంటూ ఈ దేహానికి మంచి పేరు రావాలి అని ఒక్కొక్కరు ఒక్కో రంగంలో దృష్టి పెట్టి వాటిలో ఛాంపియన్ కావాలి అని ఎంతో కష్టపడుతుంటారు. దాని కోసం వారి జీవితమంతా వెచ్చించి తమ

లక్ష్యాన్ని వదిలేస్తారు. కొంత మంది క్రికెట్ చాంపియన్ అవ్వాలి అని, కొంతమంది ఫుట్ బాల్ చాంపియన్ అవ్వాలి అని, ఇంకా కొంతమంది చెస్ లో ఛాంపియన్ అవ్వాలి అని ఇలా అనేక రంగాలలో కష్టం పడుతూ ఉంటారు. ఇంకా కొంతమంది పెద్ద ఉద్యోగం సంపాదించాలని, ధనం బాగా సంపాదించాలని, గొప్ప పదవులు సంపాదించాలని, పెద్ద యాక్టర్ అవ్వాలని, గొప్ప సింగర్ అవ్వాలి అని ఇలా ఎన్నో రకాలుగా కష్ట పడుతూ ఉంటారు. ఇలా వారి జీవితం అంతా కష్టపడుతూ తమ లక్ష్యం ఏమిటో కూడా తెలుసుకోలేరు, తాను సాధించాల్సిందేమిటో సాధించలేరు, చివరకు శరీరాన్ని వదిలేస్తారు.

అలా పైకి వెళ్ళిన తర్వాత పిచ్చోడా నువ్వు వాటికోసం వెళ్ళావా? నీ లక్ష్యం పూర్ణాత్మగా ఎదగటం, అది మానేసి నువ్వు ఎన్ని అవార్డులు పొందినా, ఎన్ని ప్యాలస్ లు కట్టినా ఏమి ప్రయోజనం? నీ శరీరం వదలగానే అవన్నీ ఎక్కడ ఉన్నాయి? అందుచేత మరల భూమ్మీదకి వెళ్ళి జ్ఞానం సంపాదించుకొని పూర్ణాత్మ అవ్వడానికి ప్రయత్నించు, లేకపోతే ఎన్ని జన్మలు తీసుకున్నా నువ్వు ఆ పని చేయవలసిందే అని చెప్పి మరల ఈ భూమ్మీదకి పంపుతారు.

ఈ భూమ్మీద ఉన్నప్పుడు వాడికి ఎన్నో సన్మానాలు చేశారు, దండలు వేశారు, ఎంతో గొప్పగా పొగిడారు, అబ్బా ఏం సాధించావురా అన్నారు. కొంతమంది గిన్నీస్ రికార్డులు కూడా సాధించారు. అలాగే ఇంకా కొంతమంది మిలిటరీలో గొప్ప కమాండర్ అయ్యాడు. ఇలా ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క రకమైనటువంటి లక్ష్యాలు పెట్టుకుంటారు. ఈ భూమ్మీద ఎన్నో కోట్ల మంది జనాభా ఉంటే ఒక్కొక్కరికి ఒక్కో లక్ష్యం ఉంటుంది. జీవితం అంతా దానికే వెచ్చిస్తారు. చాలా గొప్ప పని చేశాను, గొప్పగా సాధించాను అనుకుంటారు, పైకి వెళ్లాక దాని వల్ల ఏం ఉపయోగం లేదు అని తెలుసుకుంటారు.

అలా ఎంతోమంది ఈ భూమ్మీద అసలు తన లక్ష్యం ఏంటో

మర్చిపోయి ఏదేదో చేసి వెళ్ళిపోతున్నారు. అందుచేత ఎవరైనా సరే గుర్తుపెట్టుకోండి మోక్షం పొందాలి అంటే జన్మ లేని స్థితి పొందాలి అంటే జనన మరణ చక్రం నుంచి బయట పడాలి అంటే చావు పుట్టుకలు లేని స్థితి పొందాలి అంటే కర్మ బంధంలో నుంచి బయట పడాలి అంటే తన జీవిత లక్ష్యమైనటువంటి పూర్ణాత్మ కావడానికి ప్రయత్నించాలి, ఇంతకన్నా వేరే దారి లేదు.

మరి ఈ లక్ష్యాన్ని ఎప్పుడు సాధించగలుగుతారు అంటే “నేను దేహం కాదు నేను ఆత్మ” అన్న విషయం తెలుసుకొని, అది నిర్ధారణ చేసుకుని ఆత్మకి ప్రాముఖ్యం ఇచ్చినప్పుడు.

నా జీవితంలో కూడా అదే జరిగింది. సుమారు నాకు 53 సంవత్సరాలు వచ్చే వరకు రకరకాల వ్యాపారాలు చేస్తూ, ఎన్నో కోట్లు సంపాదించాను అయినా కూడా నాకు సంతృప్తి ఉండేది కాదు. ఎప్పుడైతే పత్రి గారి పరిచయం అయిందో అప్పుడు ఆయన “నువ్వు దేహం కాదు ఆత్మ” అని చెప్పినప్పుడు నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

మరి నేను ఆత్మను అయితే నేను చేయవలసింది ఏమిటి? అన్నది అప్పుడు అర్థమయింది. ఆత్మకి కావాల్సింది జ్ఞానం సంపాదించుకోవడమని, ఆ జ్ఞానం పరిపూర్ణంగా సంపాదించుకొని పూర్ణాత్మ కావడమే ఆత్మ యొక్క లక్ష్యం అన్న సంగతి పత్రి గారి పరిచయం అయ్యాక తెలిసింది. అప్పుడు మా వ్యాపారాలు అన్ని వదిలేసాను, అప్పటి వరకు కలిసి ఉన్నటువంటి మా ఫ్యామిలీలో మా పిల్లల్ని బయటికి పంపాను, నాకున్న పదవులన్నీ వదిలేసాను. అప్పటి నుండి నేను కానీ, మా మేడమ్ కానీ మా లక్ష్య సాధన కోసం కృషి చేస్తున్నాం. ఏమిటి లక్ష్యం అంటే పూర్ణాత్మ కావడం, పూర్ణాత్మ కావాలి అంటే ఏం చేయాలి పూర్ణ జ్ఞానాన్ని పొందాలి, ఆ పూర్ణ జ్ఞానం పొందడానికి చేయవలసిన కృషి అంతా చేస్తున్నాం.

ఆ జ్ఞానాన్ని అనంతంగా పెంచుకుంటూనే ఉన్నాం, శివుడు జ్ఞానాన్ని

పెంచుకోవడానికి నిరంతరము ఇంకా ధ్యానం ఎలా చేస్తున్నాడో మేము కూడా అలా నిరంతరం కృషి చేస్తున్నాం.

మరి పూర్ణాత్మ ఏం చేస్తాడు అంటే సృష్టికి ప్రతి సృష్టి చేస్తాడు అని పత్రి గారు చెప్పారు. ఏ మూలాత్మ అయితే ఈ లోకాలను, ఈ 84 లక్షల రకాల జీవరాశులను సృష్టించిందో అంటే ఈ ప్రకృతిలో ఎన్నో రకాలైనటువంటి వృక్ష జాతి, క్రిమి కీటక జాతి, పక్షి జాతి, మత్స్య జాతి, జంతు జాతి, ఈ మానవజాతి ఇలాంటి వాళ్ళందరినీ సృష్టించగలిగే స్థాయికి ఎదగగలడమే పూర్ణాత్మ స్థాయి. వీళ్ళందరినీ సృష్టి చేస్తూ వారిని తన స్థాయికి ఎదిగేటట్టు చూసుకోవడమే పూర్ణాత్మ యొక్క పని.

ఈ విషయం మాకు అర్థమయిన తర్వాత అన్ని ప్రక్కన పెట్టి ఆ పని మీదే మా దృష్టి పెట్టి మా శేష జీవితాన్ని నేను కానీ, మా మేడం రాజ్యలక్ష్మి కానీ దీనికే కేటాయిస్తున్నాం. జ్ఞానం పెరగాలి అంటే పత్రి గారు చెప్పినట్టు "శ్వాస మీద ధ్యాస" పెట్టి ధ్యానం చేస్తూ, శుద్ధ సాత్వికమైన శాకాహారం తీసుకుంటూ, జ్ఞానవంతమైన పుస్తకాలను స్వాధ్యాయం చేస్తూ, జ్ఞానులతో సజ్జన సాంగత్యం చేస్తూ అలాగే ఈ మార్గంలో సేవ చేస్తూ, మేము పొందిన జ్ఞానాన్ని అందరికీ పంచటం కోసం ఎన్నో రాష్ట్రాలు, జిల్లాలు తిరుగుతూ అందరిని జ్ఞానులుగా తయారు చేస్తున్నాం.

తమ లక్ష్యం ఏమిటో అర్థం అయిన వాళ్ళు ఈ మమకారాలు, భోగాలు, సంపదలు, సరదాలు అన్నీ వదలి పెట్టి తమ లక్ష్యమైన పూర్ణాత్మ అవ్వడానికి ప్రయత్నిస్తారు. అందుచేత గుర్తుపెట్టుకోండి మానవుని లక్ష్యమైనటువంటి పూర్ణాత్మగా ఎదగడమే మోక్షము. ఇక ఆ స్థాయికి వెళ్ళాక వారికి జన్మే లేదు. పూర్ణాత్మగా ఎదిగినవారు సత్యలోకం చేరుతారు. సత్యలోకం చేరిన వారికీ మరల ఈ భూమ్మీదికి రావాల్సిన అవసరం లేదు. దానినే మోక్షం అంటారు.

::12::

# "మానవుని గమ్యమైన సత్యలోకం చేరుకోవడమే మోక్షం"

మానవుని గమ్యమైన సత్యలోకం చేరుకోవడమే మోక్షం. అందుకే భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు

**శ్లో॥ అబ్రహ్మభువనాల్లోకా పునరావర్తినోర్జున**
**మాముపేత్య తు కౌంతేయా పునర్జన్మ న విద్యతే (భ.గీ. 8 – 16 )**

తా: ఓ అర్జునా! బ్రహ్మలోకాల్లాంటి లోకాలకు చేరుకున్నా మరల జన్మ తీసుకోవలసిందే! కానీ నేను వుండేటటువంటి సత్యలోకానికి చేరుకుంటే! మరల పునర్జన్మ ఉండదు.

ఆ స్థితి పొందడమే మోక్షము అంటే సత్యలోకం చేరుకోవడమే మోక్షము, అదే మానవుని జీవితం యొక్క గమ్యము.

అందుకే ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి ఎన్ని జన్మలెత్తినా చివరకు సత్య లోకం చేరుకోవాల్సిందే. ఆ సత్యలోకం చేరుకున్నప్పుడే జన్మ లేని స్థితిని పొందగలరు అంటే మోక్షాన్ని పొందగలుగుతారు.

మానవుడు ఈ భూమ్మీద పాపాలు చేస్తే శరీరం వదిలిన తర్వాత అంటే చనిపోయిన తర్వాత భువర్లోకం చేరుకుంటాడు. అక్కడ కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకొని తిరిగి అక్కడి నుంచి కారణ లోకమైనటువంటి జనాలోకం చేరుకొని అక్కడ కొన్ని కౌన్సిలింగ్లు జరిగిన తర్వాత మరల ఈ భూమ్మీదకి వస్తాడు. అలా వచ్చేటప్పుడు తన అకౌంట్ లో నుంచి అంటే సంచిత కర్మల నుంచి కొన్ని కర్మలు తీసుకొని భూమ్మీదకి వస్తాడు. మరలా ఈ జన్మలో కర్మలు చేస్తూ ఉంటాడు, ఇలా జరుగుతూ ఉంటుంది వాడి జీవితం.

అదే కొంతమంది పాప కర్మలు, పుణ్య కర్మలు రెండు చేస్తారు. అలాంటి వారు భువర్లోకం లోనే కొంచెం ఉన్నతమైన లోకానికి చేరుకొని

అక్కడ కొన్నాళ్లు ఉండి మరల జనాలోకం వెళ్ళి ఆ సంచిత కర్మలలో నుండి కొన్ని కర్మలు తీసుకుని తిరిగి ఈ భూమ్మీదకి వస్తారు.

ఇంకా కొంతమంది ఈ భూమ్మీద పుణ్య కర్మలు మాత్రమే చేస్తారు. అలాంటి వారు శరీరం వదిలిన తర్వాత సువర్లోకం చేరుకుంటారు, అక్కడ భోగాలు అనుభవించిన తర్వాత జనాలోకం చేరుకొని మళ్ళా అక్కడ కౌన్సిలింగ్‌లు అయ్యాక వారి సంచిత కర్మలలో నుంచి కొన్ని కర్మలు తీసుకొని మళ్ళీ ఈ భూమ్మీదికి వస్తారు.

ఇలా పాప కర్మలు, పుణ్య కర్మలు చేసినవారు జన్మ తీసుకుంటూ కొన్ని కర్మలు అనుభవించి ఆ శరీరాన్ని వదిలి మిగిలిన కర్మలు అనుభవించటానికి జన్మలు తీసుకుంటూనే ఉంటారు. అంటే ఇలా జనన మరణ చక్రంలో ఇరుక్కొని ఉంటారు.

ఇంకా కొంతమంది ఏం చేస్తారంటే తమ స్వార్థం వదులుకొని ఈ లోకంలో ఉన్న వారందరికీ గొప్ప గొప్ప సేవలు చేస్తూ ఉంటారు. అటువంటి వాళ్ళంతా ఈ భూమ్మీద మహాత్ములుగా కొనియాడబడతారు. అటువంటి వారు జనాలోకం పైన ఉన్నటువంటి మహాలోకం చేరుకుంటారు.

ఇంకా కొంతమంది ఈ భూమ్మీద చాలా జన్మలు తీసుకున్న తర్వాత ఓ సద్గురువుని ఆశ్రయించి ఆయన ద్వారా ఈ “శ్వాస మీద ధ్యాస” ధ్యానాన్ని తెలుసుకొని దాన్ని తీవ్రంగా చేస్తారు. ఇలా ఎవరైతే కోరికలు, సంకల్పాలు లేకుండా తీవ్రంగా ధ్యానం చేస్తారో వారు తపోలోకం చేరుకుంటారు. ఈ తపోలోకము అంటే ఇంచుమించు చాలా ఉన్నతోన్నతమైన లోకము. దానికి పైన ఉన్నది సత్యలోకం ఒక్కటే.

ఏ మానవుడైనా చివరికి ఆ సత్యలోకమే చేరుకోవాలి,ఆ ప్రయత్నమే చేయాలి. సాత్వికమైన శాఖాహారం తీసుకుంటూ, ఎక్కువ సమయం ధ్యాన సాధనకి కేటాయించి తీవ్రాతి తీవ్రంగా ధ్యానం చేసిన వారికి సత్యం

అనుభవంలోకి వచ్చే వరకు ఈ భూమ్మీదకు రావాల్సిందే. సత్యము అంటే ఆత్మ, ఆత్మానుభవం వీళ్ళు ఇంకా పొందలేదు కాబట్టి ఈ భూమ్మీదకి వస్తూ ఉంటారు. ఆ సాధనని ఇంకా తీవ్రాతి తీవ్రంగా చేస్తూ కఠినమైన ఆహార నియమాలు పాటిస్తూ వారి జీవితం గమ్యమైనటువంటి ఆ సత్యలోకం చేరాలి అన్న అవగాహనతో ఈ సాధన చేస్తూ వారి జీవితాన్ని దానికే అంకితం చేస్తారు.

ఇటువంటి వారు నేను దేహం కాదు ఆత్మ అన్నట్టుగా జీవిస్తారు. దేహం అన్నట్టుగా జీవిస్తే సంసారం మీద, పిల్లల మీద, ధనం మీద మమకారం ఉంటుంది. వాటి కోసం ఆరాట పడుతూ ఉంటారు. కానీ ఎవరైతే నేను ఆత్మ అన్నట్టుగా జీవిస్తారో వీటన్నిటి మీద వారికి కోరికలు ఉండవు, వ్యామోహం ఉండదు, తాపత్రయం ఉండదు.

అందుచేత ఈ రకంగా జీవించడం వల్ల ఆత్మ స్థితిలోనే ఉంటూ సాధన చేస్తూ, ఆ రకమైన తీవ్ర సాధన చేయడం వల్ల సృష్టిలోని అపారమైన జ్ఞానాన్ని వాళ్ళు సంపాదించుకో గలుగుతారు. వీళ్ళు ఎక్కువ ధ్యాన సాధనకు ప్రాముఖ్యం ఇస్తారు, సమయం దొరికితే చాలు సాధన మీదే ఉంటుంది వారి దృష్టి. వాళ్ళు చేసే పనులు, మాట్లాడే మాటలు, వాళ్ళు చేసే సేవలు అన్నీ ఆత్మకు సంబంధించినవై ఉంటాయి.

ఈ లోకంలో ఉన్న వారందరికీ ఆత్మ యొక్క గొప్పతనం బోధిస్తూ, వారిని కూడా ఈ మార్గంలో నడిపించే ప్రయత్నం చేస్తారు. ఇప్పుడు మీరందరూ కూడా ఎవరి స్థాయిలో వాళ్ళు ఈ రకమైన ప్రయత్నం చేస్తున్నారు. మీరందరూ కూడా దేహ సంబంధమైనటువంటి వాటికి ప్రాముఖ్యం తగ్గిస్తున్నారు, ఆత్మసంబంధమైన వాటికే ప్రాముఖ్యం ఇస్తున్నారు. కచ్చితంగా మెల్లి మెల్లిగా మీలో మార్పులు వస్తాయి. అంటే ఆత్మను అనుభవంలోకి తెచ్చుకుంటున్నారు అని అర్థం చేసుకోవచ్చు.

అందుచేత ఇటువంటి వారందరూ వారి శరీరం వదిలిన తర్వాత

ఆ సత్యలోకం చేరుకుంటారు. ఇంక ఆ సత్యలోకం చేరుకున్న తర్వాత ఈ భూమ్మీదకి రావల్సిన పని లేదు.

కానీ ఎంతో గొప్ప జ్ఞానం సంపాదించుకొని, కర్మలన్నీ రహితం చేసుకొని ఆ సత్యలోకం చేరుకున్న వారు కూడా వారికి ఇష్టం అయితే లోక కళ్యాణం కోసం వారు పొందినటువంటి జ్ఞానాన్ని లోకంలో అందరికీ అందించడం కోసం భూమ్మీదకి వస్తారు.

ఈ భూమ్మీద కర్మలు అనుభవించడం కోసం వచ్చే వాళ్ళది జన్మ అవుతుంది, కర్మలు లేకపోయినా లోక కళ్యాణం కోసం ఈ భూమ్మీద వస్తే వాళ్ళది అవతారం అవుతుంది అని పత్రి గారు చెప్పారు. అలా ఈ భూమ్మీదకు వచ్చిన గొప్పవారిలో పత్రి గారు ఒకరు.

ఇంకా కొంతమంది ఆ సత్యలోకం చేరుకున్నాక ఆ సృష్టి యొక్క కార్యక్రమంలో పాల్గొంటూ ఉంటారు. ఇలా జరుగుతూ ఉంటుంది. మొత్తం మీద ఆ సత్యలోకం చేరుకుంటే మోక్షం పొందినట్టే లెక్క.

మరి అటువంటి స్థితిని సాధించాలి అంటే "శ్వాస మీద ధ్యాస" పెట్టి తీవ్రంగా ధ్యానం చేయాలి, కఠినమైన ఆహార నియమాలు పాటిస్తూ అంటే శుద్ధ సాత్వికమైన ఆహారం మాత్రమే తీసుకోవాలి. ఈ రెండిటిలో ఏది లోపించినా ఆ స్థితికి ఎదగడం కష్టం.

ఈ సృష్టిలో ఏడు రకాల లోకాలు ఉంటాయని భూలోకము, భువర్లోకం, సువర్లోకం, జనలోకం, మహాలోకం, తపోలోకం, సత్య లోకం. ఇక్కడ మనం గమనించినట్లయితే భూలోకంలో స్థూల శరీరంతో ఉంటారు. ఈ స్థూల శరీరంతో భూవర్లోకం కానీ సువర్లోకం కానీ చేరుకోలేరు. అందుచేత ఈ భూలోకంలో ఈ స్థూల శరీరాన్ని అంటే ఈ భౌతిక శరీరాన్ని వదిలేసి ఆ సూక్ష్మ శరీరంతో ఆ భువర్లోకం కానీ సువర్లోకం కానీ చేరుకుంటారు.

అక్కడి నుంచి జనాలోకం వెళ్ళాలంటే మనోమయ శరీరం అంటే

సూక్ష్మ శరీరం వదిలి కారణ శరీరంతో ఆ జనాలోకం చేరుకుంటారు.

అక్కడ కౌన్సెలింగ్ జరిగిన తరువాత కొన్ని కర్మలు తీసుకొని మరల భూమీ్మదికి రావాలి అని నిర్ణయించుకున్నప్పుడు వారు ఎంచుకున్న కర్మలను బట్టి నాడీ మండల శరీరం తయారవుతుంది.

అలా మళ్ళీ భూమి మీదకి వస్తారు. కానీ ఎవరైతే భూమీ్మద ఇంకా తీవ్రాతి తీవ్రమైన ధ్యానం చేస్తారో వాళ్ళు ఇంకా అపారమైన శక్తి సంపాదించుకొని ఆ శక్తి పెరిగే కొద్దీ మనసు శుద్ధి అవుతూ, ఆ మనసు ఇంకా శూన్యం అవుతూ ఉంటుంది. మొదట్లో చంచలమైన మనసు నిశ్చలం అవుతుంది, నిశ్చలమైన మనసు నిర్మలం అవుతుంది, నిర్మలమైన మనసు శూన్యం అవుతుంది. ఆ శూన్య స్థితి పెరిగే కొద్ది, ఆ మనసు శూన్యం అయ్యే కొద్దీ మీలో శక్తి పెరుగుతుంది. మీలో శక్తి పెరిగితేనే మీ మనసు శూన్యం అయినట్టు లెక్క.

మీ మనసు ఎంత శూన్యం అయితే దానికి అనుగుణమైనటువంటి లోకాలకు చేరుకుంటారు. అందుచేత ఆ జనాలోకం దాటి ఉన్నతమైన లోకాలకు వెళ్ళాలి అంటే మీ మనసు శూన్యం అవ్వాలి. మీ మనసు శూన్యం అవ్వాలి అంటే తీవ్రాతి తీవ్రమైన ధ్యాన సాధన చేయాలి. మీరు చేసిన సాధనను బట్టి ఆ పైలోకాలకు చేరే అర్హతను సంపాదించుకుంటారు. మీరు చేసే తీవ్ర సాధన ఎంత చేస్తే ఆ రకంగా ఎదుగుతారు అంత ఉన్నత లోకాలకి చేరుకుంటారు.

నేను అందుకే భీమవరం వదిలి పెట్టకండి అంటాను. ఎంత అవకాశం ఉంటే అంత సాధన చేయండి. మీరు బద్ధకించకుండా కష్టపడితే ఈ భూమీ్మద ఉన్న కష్టాల నుండి బయట పడగలుగుతారు అంతే కాకుండా మరల ఈ భూమీ్మదకి రావాల్సిన అవసరం ఉండదు. మీరు ఎంత కష్టపడి సాధన చేస్తే మీ మనసును అంత శూన్యం చేసుకోగలుగుతారు. మీ మనసు ఎంత శూన్యం అయితే అంత గొప్ప లోకాలకు చేరుకునే అర్హత లభిస్తుంది.

కొంతమంది ఈ మార్గంలోకి వచ్చి కూడా సంకల్పాలు పెట్టి ధ్యానం చేస్తున్నారు. ఇంకా కోరికలు అని, ఆ కోరికలు తీరితే మురిసిపోతూ ఉంటారు, ఇంకా కొంతమంది నాకు ఆ అనుభవం వచ్చింది ఈ అనుభవం వచ్చింది అంటూ, నాకు అవి కనపడ్డాయి, ఇవి కనపడ్డాయి అని అక్కడే ఆగి పోతున్నారు.

కానీ ఎవరైతే వాటిని పట్టించుకోకుండా మనసుని ఇంకా ఇంకా శూన్యం చేసుకుంటారో వాళ్ళు ఆ పై లోకాలకి వెళ్ళగలిగే అర్హత సంపాదిస్తారు. అందుకే పాప పుణ్యాలు చేసిన ఆత్మను తీసుకువెళ్ళడానికి జనాలోకం కింద ఉన్నటువంటి లోకాల్లో ఉన్నటువంటి సహాయకులు ఈ భూమ్మీదకి వస్తారు.

కానీ ఎవరైతే తీవ్ర సాధన చేసి జ్ఞానాన్ని పెంచుకుంటారో వారు శరీరాన్ని వదిలిన తర్వాత వారిని తీసుకెళ్ళడానికి ఆ జనాలోకం దాటి ఉన్నటువంటి ఆ గొప్ప గొప్ప లోకాలు అంటే మహాలోకము, తపోలోకములకు చెందినటువంటి గొప్ప యోగులు వస్తారు.

అందుచేత గుర్తు పెట్టుకోండి మీ మనసు ఎంత శూన్యం చేసుకుంటే మీరు అంత గొప్ప లోకాలు చేరుకునే అర్హత వస్తుంది. అందుకే శూన్యము, పరిశూన్యము, మహాపరిశూన్యము అని చెప్పడం జరిగింది. బుద్ధుడు మొదటి జాములో శూన్య స్థితి పొందాడు, రెండో జాములో ఈ "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేసి మహా శూన్య స్థితి పొందాడు, మూడో జాములో మహా పరిశూన్య స్థితి సాధించాడు. ఆయన ఇంకా సంపాదించవలసింది అంటూ ఇంకేదీ లేదు కాబట్టి ఆయన నిర్వాణం పొందాడు. ఆయన ఇంక ఈ భూమ్మీదకి వచ్చే అవసరం లేదు, ఆ సత్యలోకానికి చేరుకోగలిగాడు.


అందుచేత మీరు గుర్తుపెట్టుకోండి సత్యలోకం అంటే మహా పరిశూన్య స్థితిలో ఉన్నటువంటి లోకం. దానికి ఎంత తీవ్ర సాధన చేయాలో మీ మనసు ఎంత పరిశూన్య స్థితికి చేరుకోవాలో అర్థం చేసుకోండి.

బుద్ధుడు, కృష్ణుడు, రాముడు ఇలా గొప్ప గొప్ప వాళ్ళంతా అటువంటి

స్థితిని సాధించారు. ఇంకా వ్యాసుల వారు, వశిష్ట మహర్షి ఇలాంటి ఎందరో ఋషులు, మహర్షులు అంత గొప్ప స్థితికి చేరుకున్నారు.

అందుకే మీరందరూ కూడా తీవ్రాతి తీవ్రంగా సాధన చేయాలి. మీరు చేసే సాధనతో తృప్తిపడకుండా మీరు ఎంత కృషి చేస్తే మీ శక్తి అంతా పెరుగుతూ ఉంటుంది, మీ మనసు శూన్యం అవుతుంది, మీ మనసు శూన్యం అయ్యే కొద్దీ మీరు ఆ పై లోకాలు చేరుకోవటానికి అర్హత సాధిస్తారు.

ఈ మార్గంలోకి రావటం మీ అదృష్టం, ఎన్నో జన్మల పుణ్య ఫలం ఉంటే తప్ప పత్రి గారి లాంటి గురువు దగ్గరకు రాలేరు. నిజంగా ఆ రకమైన అర్హత సంపాదించుకున్న వారంతా తీవ్ర సాధన చేయడం కోసమే ప్రకృతి భీమవరంలో ప్రతి నెలా 1,2,3 తారీఖులలో ధ్యాన యజ్ఞం అనే కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఇటువంటి ఏర్పాటు నేను కానీ, మేడమ్ కానీ చేసింది కాదు అది ప్రకృతి యొక్క నిర్ణయం. కాబట్టి మీరందరూ ఆ కార్యక్రమంలో పాల్గొని తీవ్రాతి తీవ్రంగా ధ్యానం చేసి మీ మనసు శూన్యం చేసుకుని ఆ గొప్ప లోకాలకు చేరుకునే అర్హతను పొందండి, సత్యలోకం చేరి మోక్షాన్ని పొందండి.



::13::

# "జన్మ రాహిత్యమే మోక్షం"

"జన్మ రాహిత్యము అంటే జన్మ అన్నది లేకుండా ఉండటం, అంటే చనిపోయిన తర్వాత మరలా పుట్టకుండా ఉండటం. మరలా జన్మించకుండా ఉండడమే జన్మ రాహిత్యం అదే మోక్షం".

మీరు ఒక విషయం గుర్తుపెట్టుకోండి అది ఏమిటంటే "కర్మ రాహిత్యమే జన్మ రాహిత్యం", కర్మే లేకపోతే జన్మే లేదు. జన్మ ఎప్పుడు ఉంటుంది అంటే కర్మలు ఉన్నప్పుడే, అది సృష్టిలో ఉన్నటువంటి ఏర్పాటు.

అందుచేత ఎవరు అయితే మోక్షం పొందాలనుకుంటారో వాళ్ళు ఆ జన్మ రాహిత్యం స్థితి సంపాదించాలి. ఈ జన్మరాహిత్య స్థితి కర్మలన్నీ దగ్ధం అయినప్పుడే వస్తుంది. ఎంతకాలం మీ అకౌంట్ లో కర్మలు ఉంటాయో అంతకాలం మీరు జన్మ రాహిత్యాన్ని పొందలేరు. ఆ స్థితి పొందాలి అంటే జన్మను కలుగజేసే కర్మలన్నీ దగ్ధం అవ్వాలి, కర్మ రాహిత్య స్థితి సంపాదించాలి.

కర్మ సిద్ధాంతం ప్రకారం మూడు రకాల కర్మలు ఉంటాయి. అవి సంచిత కర్మలు, వర్తమాన కర్మలు, ఆగామి కర్మలు. మరి ఈ వర్తమాన కర్మలలో కొన్ని ఈ జన్మలో అనుభవిస్తారు, అనుభవించగా మిగిలినవి మీ ఖాతాలో అంటే సంచితంలో మరణానంతరం కలపబడతాయి. ఆ సంచితంలో కర్మలు ఉన్నంత కాలం జన్మలు ఉంటాయి, అందుకే సంచితాన్ని రద్దు చేసుకోవాలి, ఆ సంచిని ఖాళీ చేసుకోవాలి. ఆ సంచితంలో ఏమాత్రం కర్మలు ఉన్నా కచ్చితంగా జన్మ తీసుకోవాల్సిందే.

జన్మ తీసుకునేటప్పుడు సంచితంలో నుంచి కొన్ని కర్మలు అంటే ప్రారబ్ధ కర్మలు తీసుకొని ఈ భూమ్మీదకు వచ్చి తెచ్చుకున్న కర్మలు అన్నీ అనుభవిస్తారు, కానీ మరల కొత్త కర్మలు అంటే ఆగామి కర్మలు చేస్తూ కొన్ని

ఇక్కడ అనుభవించి మిగిలినవి సంచితంలో కలపబడతాయి.

ఒక రకంగా చెప్పాలి అంటే ఆగామి కర్మల్లో 60% నుండి 70% ఈ జన్మలోనే అనుభవిస్తారు, మిగిలినవి మరణానంతరం సంచితంలో కలపబడతాయి. ఎందుకంటే చేసే కర్మలు ఎక్కువ ఉంటాయి, అనుభవించేవి తక్కువ ఉంటాయి కాబట్టి.

చాలా మంది ఈ జన్మలో చేసిన కర్మలు మరుజన్మకి బదిలీ అవుతాయి అనుకుంటారు, కానీ ఈ జన్మలో చేసిన కర్మలలో 60% కర్మలు ఈ జన్మలోనే అనుభవించవలసి ఉంటుంది. ఇది మీకు అర్థమైతే మీరు మరికొన్ని లాభాలు పొందొచ్చు, ఎలాగంటే చాలామంది పాపాలు చేస్తే అవి ఎప్పుడో ఇంకో జన్మకి వెళ్తాయి, అప్పుడు నేను ఉంటానో! ఉండనో! అవి అనుభవిస్తానో! అనుభవించానో! అని అనుకుంటూ పాపాలు చేస్తూ ఉంటారు.

ఇంకా ఏమంటారంటే? నేను ఏమైనా చూసానా? మరుజన్మ ఉందని ఎవరు చెప్పగలరు? ఇప్పటినుంచే ఆ భోగాలు అనుభవించకుండా త్యాగం ఎందుకు చేయాలి? అని అనుకుంటారు. కొంతమంది ఈ ప్రశ్న నన్నే అడిగారు, "ఏవండీ ఎప్పుడో అనుభవిస్తారు అంటారు అసలు జన్మ ఉందో, లేదో మీరు ఎలా చెప్పగలరు? అప్పుడు నేను ఉంటానో ఉండనో కదా ? అందుచేత ఉన్నంతలో నేను ఎంజాయ్ చేయాలి, నేను ఎందుకు మాంసం మానేయాలి? అంత రుచికరమైన ఆహారం" అని చెప్పి అనేవాళ్ళు ఉన్నారు. నరకం అనుభవిస్తారు రా బాబు అంటే "అసలు ఆ జన్మ ఉంటుందో, ఉండదో అనుభవిస్తామో? లేదో? ఎందుకు ఇప్పుడు నేను త్యాగం చేయాలి? మాంసాహారం తింటే, నాకు రోగాలు వస్తాయి అంటున్నారు... సరే ఆ రోగం వచ్చి మంచం మీద పడితే సేవ చేయడానికి నా భార్య ఉంది, వైద్యం చేయడానికి డాక్టర్లు ఉన్నారు, నేను ఎందుకు బాధపడాలి" అనే వాళ్ళు ఉన్నారు.

అందుచేత ఈ జన్మలో నువ్వు పాపాలు చేస్తే ఈ జన్మలోనే

అనుభవించే అవకాశం ఉంది అని తెలుసుకోండి. అలాగే ఇంకా చాలామంది "మీరు పుణ్యం చేయమంటారు, దానం చేయమంటారు ఇస్తే ఏమిటి ఉపయోగం? ఎప్పుడో వస్తుంది అంటున్నారు వస్తుందో? రాదో ?నాకేం తెలుసు. ఇప్పుడు నేను చేసి ఉపయోగం ఏముంది?" అని అడుగుతూ ఉంటారు.

ఎందుకంటే లోకంలో చాలామందికి ఉన్న అభిప్రాయం ఏదైనా ఇప్పుడు చేస్తే ఇప్పుడే రావాలి అలా అయితేనే చేస్తాను అంటారు. ఒకడు ఒక మంచి పని చేశాడు, దానం చేశాడు, డబ్బు ఖర్చు పెట్టాడు దాని ఫలితం ఇప్పుడే రావాలి అంటాడు. అలా ఫలితం వెంటనే కనపడకపోతే ఆ పని చేయడానికి ఉత్సాహం చూపించడు. కానీ గుర్తుపెట్టుకోండి ఈ జన్మలో చేసినవి ఎక్కువ శాతం కర్మలు ఈ జన్మలోనే అనుభవిస్తారు.

అందుచేత ఇది మీకు అర్థమైతే మీ భవిష్యత్తుని మీరు అనుకున్నట్టు రూపొందించుకోవచ్చు. ఇప్పుడు మీరు ధనం లేదని బాధపడుతున్నారు, కాని ఆ ధనాన్ని మీరు భవిష్యత్తులో సంపాదించుకునే అవకాశం ఉంది.

ఉదాహరణకు మీరు డబ్బు లేదని బాధపడుతున్నారు, అందరికీ ఉంది నాకు లేదు అని రాత్రి పగలు కష్టపడతారు, కాని రాదు, ఎందుకు అంటే? ధనం అన్నది కష్టపడితే వచ్చేది కాదు అర్హత సంపాదించుకోవాలి, ఈ అర్హత ఎలా వస్తుంది అంటే? " ఇస్తే వస్తుంది". నీకు ధనం కావాలన్నప్పుడు ధనాన్ని దానం చేయి, నువ్వు దానం చేస్తేనే ఆ ధనం వచ్చేది, ప్రకృతిలో ఇచ్చింది వృధా కాదు, కచ్చితంగా తిరిగి వచ్చి తీరుతుంది.

నా విషయంలో చూసుకుంటే నా గత జన్మ సంస్కారం వల్ల, పుణ్యం వల్ల ఒక మంచి కుటుంబంలో జన్మించడం, మంచి వ్యాపార అవకాశాలు ఉన్న కుటుంబంలో జన్మించడం జరిగింది. నేను చిన్నప్పటి నుంచి వ్యాపారం చేయడం వల్ల నాకు బాగానే కలిసి వచ్చింది.

కానీ నేను సంపాదించుకున్న పుణ్యం అయిపోయినట్టుంది, సరిగ్గా

పత్రి గారు పరిచయం అయ్యే టైంకి నా సంపాదనకు బ్రేక్ పడింది. ఎన్ని వ్యాపారాలు చేస్తున్నా ఎందులోనూ కలిసి రాలేదు, ఎందులోనూ లాభం లేదు, ఏంటి ఇలా అయిపోయింది? అనుకున్నా! ఆ సమయంలోనే పత్రిగారి పరిచయం అవ్వడం, ఆయన చెప్పిన మాటలు, ఆయన వ్రాసిన పుస్తకాలు, ఆయన ఇచ్చిన సందేశాలు నన్ను బాగా ఆకర్షించాయి. అప్పుడు ఈ మార్గంలోకి వచ్చి ఆయన చెప్పినట్టు చేస్తూ నేను తెలుసుకున్న జ్ఞానాన్ని అందరికి పంచుతూ ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాను.

ఇంచుమించు 2002 నుంచి అంటే ఆర్థికంగా వెనక్కి వెళ్ళినప్పటినుంచి సుమారు 2012 వరకు వ్యాపారాలు అన్నీ మూసేసాను. పత్రి గారు చెప్పినట్లు ఎన్నో చోట్లకీ తిరుగుతూ నేను తెలుసుకున్న జ్ఞానాన్ని అందరికీ పంచడం జరిగింది. ఆ సమయంలో మా పిల్లల్ని బయటికి పంపించడం వల్ల వాళ్ళకు డబ్బు ఇవ్వాల్సి వచ్చింది, ఆస్తులు ఇవ్వాల్సి వచ్చింది. నాకున్న స్తోమత తగ్గిపోయింది. అయినా సరే ఉన్న దాంట్లో సరిపెట్టుకుంటూ ధ్యాన, జ్ఞాన ప్రచారం చేసాము. పైకి మేము కోటీశ్వరులు అన్నట్టుగానే ఉన్నాము, కానీ మేము ఎంత ఇబ్బంది పడ్డామో మాకు తెలుసు.

ఆ 10 ఏళ్ళు పరీక్షా కాలమో లేకపోతే సేవా కాలమో నాకు తెలియదు, కానీ పత్రి గారు చెప్పినట్టు చేయడం వల్ల మరల మేము అర్హత పొందాము. ఆ 10 సంవత్సరాల తర్వాత మేము అంతకుముందు ఎంత ప్రయత్నం చేసినా అవ్వని పనులు అయిపోవటం, అలానే మా ఆస్తులు ఉన్న ఏరియా మార్కెట్ విలువ పెరగడం, అక్కడ మేము షాప్స్ కట్టించడం, వాటి ద్వారా ఆదాయం పెంచుకున్నాం. ఇంకా మాకు ఉన్న భూముల విలువ బాగా పెరిగింది. చూస్తే అంతకు ముందు ఉండేటటువంటి ఆస్తికి, ఇప్పుడు ఉండే ఆస్తికి సంబంధం లేకుండా పెరిగిపోయింది. ఈ 10 ఏళ్ళు అందరికి ధ్యానం, శాఖాహారం, జ్ఞానం పంచడానికి నేను, మేడం కృషి చేశాం. దాని మీద

అర్హత వచ్చి ఈ స్థాయికి ఎదగగలిగాము అని అనుకున్నాను.

ఇది అర్థమయ్యే నేను అందరికీ చెప్తూ ఉంటాను సంపాదన మీద కంటే కూడా మీరు పంచడం మీద ఎక్కువ దృష్టి పెట్టండి, సేవ చేయండి, ఈ జ్ఞానాన్ని పంచడం అన్నది అన్నింటికంటే ఉత్తమోత్తమమైనటువంటి పని, ఈ పని మానకండి కష్టమైనా చేయండి అని అంటాను. ఈ జ్ఞానాన్ని తిరిగి తిరిగి పంచమని నేను చెప్తూ ఉంటాను. మీరు చేసిన దానికి ఎప్పుడు రావాలో అప్పుడు ప్రకృతి నిర్ణయం ప్రకారం వస్తుంది.

అందుచేత ఈ జన్మలో చేసుకున్నది ఈ జన్మలోనే అనుభవించే అవకాశం ఉందని తెలుసుకోండి.

అలాగే మోక్షం కూడా. మోక్షం అంటే జన్మ రాహిత్యము అంటే కర్మ రాహిత్యం అంటారు. ఈ కర్మ రాహిత్యం ఎలా సాధించవచ్చు అని భగవద్గీతలో

**శ్లో॥ యథై దాంసి సమిద్ధోగ్నిర్భస్మా సాత్కుర తేర్జున**
**జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా (భ.గీ. 4-37)**

తా: అర్జునా! బాగుగా ప్రజ్వలింప జేయబడిన అగ్ని కట్టెలను ఏప్రకారము బూడిదగాచేయునో ఆ ప్రకారమే జ్ఞానమను అగ్ని సమస్త కర్మలను భస్మం చేయుచున్నది.


ఇక్కడ సమస్త కర్మలు అంటే పాప కర్మలు, పుణ్య కర్మలు ఏవైతే నీ ఖాతాలో నీ సంచితంలో ఉన్నాయో అవన్నీ దగ్ధం అయిపోతాయి. నువ్వు తెచ్చుకున్న ప్రారబ్ధం పోతుంది, నువ్వు కొత్తగా చేస్తున్నటువంటి ఆగామి కర్మలు కూడా రహితం అయిపోతాయి, ఆఖరికి నీ సంచిత కర్మలు కూడా రహితం అయిపోతాయి.

అసలు కర్మలే లేకపోతే ఇంక జన్మ ఎక్కడ ఉంటుంది? అటువంటి జన్మ రాహిత్యమే మోక్షము అని తెలుసుకోండి. అందుచేత ఆ స్థితి రావాలను

కున్నవాడు జ్ఞానాన్ని పెంచుకునే ప్రయత్నం  చేయాలి, ఆ జ్ఞానం రావాలంటే పత్రి గారు చెప్పినట్లు సాధన, స్వాధ్యాయం, సాంగత్యం, సేవ అనే నాలుగు పనులు నిరంతరం చేస్తూ జీవించినట్లయితే మీ భవిష్యత్తు అద్భుతంగా మారిపోతుంది.

ఎంతసేపు నా కూతురు, నా కొడుకు, నా సంసారం, నా సంపాదన అంటూ కూర్చుంటే దుఃఖం పెరుగుతుంది కాని, తగ్గదు. అందుచేత దేని మీద దృష్టి పెట్టాలో దాని మీద దృష్టి పెట్టండి. మీ అదృష్టం కొద్ది పత్రి గారి లాంటి గురువు దొరికారు, అద్భుతమైన "శ్వాస మీద ధ్యాస" అనే మోక్ష మార్గం ఇచ్చారు.  కర్మ రహితానికి కావలసిన జ్ఞానం పొందడానికి ముఖ్యంగా కావలసిన సాధన "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

అందుచేత గుర్తుపెట్టుకోండి "జన్మ రాహిత్యమే మోక్షం" అన్నది తెలుసుకోండి. అలాగే " కర్మ రాహిత్యమే జన్మ రాహిత్యం" అని కూడా తెలుసుకోండి. ఆ "కర్మ రాహిత్యం అన్నది జ్ఞానంతోనే సాధ్యం".   ఆ జ్ఞానం అన్నది "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ద్వారానే ఎవరైనా పొందగలరు అని తెలుసు కోండి.



::14::

# "మోహక్షయమే మోక్షం"

పూర్వ కాలం నుండి ఎందరో ఋషులు, యోగులు, యోగీశ్వరులు ఈ మోక్షం గురించి రకరకాలుగా మనకు వివరించడం జరిగింది. అందుకే వాటిని మనం అవగాహన చేసుకొని మన జ్ఞాన పరిధిని పెంచుకోవాలి. "మోహక్షయమే మోక్షం" అని కూడా అన్నారు.

మీరు ఎప్పుడైతే మోహం నుండి బయట పడతారో అప్పుడు మోక్షాన్ని పొందుతారు. ఈ ప్రపంచంలో ఉన్న అన్నిటి మీద ఉన్న వ్యామోహం నుండి మీరు బయటపడాలి అంటే ధనం మీద, పేరు ప్రఖ్యాతుల మీద, పదవుల మీద, భార్య/భర్త మీద, పిల్లల మీద ఉన్న వ్యామోహం పూర్తిగా తొలిగిపోతే మోక్షాన్ని పొందగలుగుతారు.

వ్యామోహం ఉన్న వాళ్ళకే మమకారం ఎక్కువగా ఉంటుంది. అలా అని బంధాలను వదులుకోనవసరం లేదు, కానీ వారి మీద ఉన్న మమకారాన్ని వదులుకోవాలి.

కొంతమంది వాళ్ళ దగ్గర వారికి ఏదైనా జరిగితే విపరీతమైన బాధ, ఆదుర్దా, కంగారు పడిపోతూ ఉంటారు, భయపడుతూ ఉంటారు. కానీ జరిగితే జరిగింది అని బాధ పడకుండా ఆ సమయంలో వారికి మీరు చేయగలిగిన సాయం, సేవ చేయాలి. అంతేకాని కంగారు పడితే మీరు వారి మీద వ్యామోహంతో ఉన్నట్టు లెక్క.

నీ భర్త ఎక్కడో ఉన్నాడు ఏదో జరిగిందని ఫోన్ వచ్చింది, ఏం చేయగలవు కంగారుపడి, బాధపడి, ఆందోళన పడితే ఏమీ చేయలేవు. అందుచేత ఎటువంటి కంగారుపడకుండా నువ్వు చేయవలసిన సాయమేదో అది చేయి.

మీ అబ్బాయి ఎక్కడో ఉన్నాడు బండి మీద నుండి పడిపోయాడనో లేకపోతే చిన్న దెబ్బ తగిలిందనో ఎవరో ఫోన్ చేశారనుకోండి, ఇంక "నా జీవితమే వ్యర్థమైపోయింది, అనవసరంగా వాడిని దూరంగా పంపాను" అని ఇంక ఎంతసేపూ అదే ఆలోచిస్తూ, బాధపడుతూ ఉంటే అదంతా మమకారం, వ్యామోహం.

కానీ ఏ కంగారు లేకుండా అక్కడ తెలిసిన వారికి ఫోన్ చేసి వాడికి ఏం సాయం కావాలో చూసుకొని, అవసరమైతే మీరు అక్కడికి వెళ్లి వాడికి కావాల్సిన అన్ని సహాయ సహకారాలు చేస్తూ, సేవలు చేస్తూ చూసుకోవడం అన్నది వ్యామోహం లేకపోవడం.

ఇక్కడ వారిని వదిలేయడం అంటూ ఏమీ లేదు, అన్ని చేస్తారు, అన్ని చూసుకుంటారు కానీ ఆందోళన పడరు, భయపడరు, దుఃఖపడరు. ఇలా అయిపోయిందే వాడి బ్రతుకు అనుకుంటూ అదే ఆలోచనలో ఉండకూడదు. అలాంటి మమకారం వ్యామోహం, లేకపోవడాన్ని మోహక్షయం అంటారు.

మీరు చూడండి డబ్బు మీద వ్యామోహం లేని వారంటూ ఎవ్వరు ఉండరు. ఎలాంటి వారికైనా సరే డబ్బు అవసరం ఉంటుంది కానీ ఆ డబ్బు మీద వ్యామోహం, మమకారం లేకపోతే ధర్మంగా సంపాదించగలరు.

ధనం మీద మమకారం ఉన్నవాడు అధర్మం గా సంపాదిస్తాడు, ఎంత వచ్చినా ఎంత ఉన్నా తృప్తి పడడు. "ధనం మీద మమకారం లేని వాడికి ఆశ ఉండదు, మమకారం ఉన్నవాడి ఆశకు అంతే లేదు".

ధనం మీద మమకారం లేని వాడు నాకు అంత ఆస్తి ఉంది ఇంత ఆస్తి ఉంది అని గొప్పలకి పోడు. ధనం మీద మమకారం లేనివాడు తప్పులు పాపాలు చేయడు, ధర్మంగా సంపాదిస్తాడు, అధర్మంగా వ్యవహరించడు, అవసరాలకు పరిమితం అవుతాడు, ఆర్భాటాలకు పోడు, తన స్థాయికి తగ్గట్టే

ప్రవర్తిస్తాడు. మీలో ఏ మాత్రం వ్యామోహం ఉన్న మమకారం ఉంటుంది దానికి తగ్గట్టే మీ ప్రవర్తన ఉంటుంది.

అందుకే పత్రి గారు కూడా "ధనం మీద వ్యామోహం లేని వాడికి సుఖాల మీద దృష్టి ఉండదు, ధనం మీద వ్యామోహం ఉన్నవాడికి సుఖపడాలనే తాపత్రయం ఉంటుంది. ధనం మీద వ్యామోహం లేనివాడు ఆ సందర్భాన్ని బట్టి అక్కడున్న అవసరాన్ని బట్టి దానికి అనుగుణంగా జీవిస్తాడు, ప్రవర్తిస్తాడు" అని చెప్పేవారు.

ఈ సందర్భంగా చిన్న ఉదాహరణ చెప్తాను. మా మేడం జ్ఞానస్థితికి వచ్చిందా? లేదా? అనే సందేహం నాకు ఉండేది. కాని నిన్న అర్థమైంది మార్చిలో బెంగళూరుకు ఆవిడ క్లాస్‌లు ఇచ్చాము. ఆవిడ ప్రయాణించేటప్పుడు ఎప్పుడు సెకండ్ ఏ సి బుక్ చేయమంటుంది, కాని ఈ సారి స్లీపరే ఉన్నాయి. అయినా సరే బయలుదేరడానికి సిద్ధపడింది, చేయాలనుకున్న పని మానకూడదు నా ధర్మం నేను నిర్వర్తించాలి అని చెప్పి పర్లేదు వెళ్తాను అంది. నేను ఆశ్చర్యపోయాను, ఈవిడ చాలా ఎదిగింది అని నాకు అర్థమయ్యింది.

అందుచేత గుర్తుపెట్టుకోండి మీరు మోక్ష స్థితికి వచ్చారు అనడానికి ఈ రకమైన ప్రవర్తన మీలో రావాలి లేకపోతే ఇంకా చాలా జన్మలు తీసుకోవాలి.

ధ్యానం చేసేస్తున్నాను మోక్షం వచ్చేస్తుంది అనుకుంటారు కానీ ధ్యానం చేసినంత మాత్రాన, అనుభవాలు పొందినంత మాత్రాన మోక్షం రాదు, ముందు మీ ప్రవర్తనలో మార్పు రావాలి. ధనం మీద కానీ, పిల్లల మీద కానీ, భార్య/భర్త మీద కానీ మమకారం అంటే మోహం ఉండకూడదు.

నేను పత్రి గారిని కూడా చాలా సార్లు గమనించాను, ఉంటే ఎంజాయ్ చేస్తారు లేకపోతే లేదని అనుకోరు. చిత్తూరు లో మన బాబు బాలకృష్ణ ఆహ్వానించడమే కాదు అడిగితే కార్యక్రమం ఏర్పాటు చేశాడు. వారి ఇంటికి తీసుకెళ్ళాడు, అంతకుముందు బెంగళూరులో మంచి సౌకర్యాలతో అకామిడేషన్

ఉంది. కాని చిత్తూరులో ఆయన స్థితిని బట్టి  అకామిడేషన్ ఇచ్చాడు, మరి అక్కడ ఉండటం నా వల్ల కాదు అని నేను అనుకోలేదు, వెళ్ళిన పని పూర్తి చేసుకొని వచ్చాను.

పత్రి గారి విషయంలో కూడా ఇది గమనించాను. 2012 దాటిన తర్వాత ఆయనకు అన్ని చోట్ల సౌకర్యాలు ఉన్నాయి. ఎక్కడికి వెళ్ళినా మంచి ఉన్నాయి.  కానీ 2002 లో నేను ఇందులోకి ఎంటర్ అయినప్పుడు ఆయనకు పూర్తిగా అన్నీ లేవు. అప్పుడు ఆయన బస్సుల్లోనూ, ట్రైన్ లోను తిరిగేవారు. దానికి ఇంకొక ఐదు ఆరేళ్ళు వెనక్కి చూస్తే ఎలాంటి పరిస్థితి ఉండేదో నాకు అర్థమయింది. ఆయనకు పనిమీద దృష్టి ఉండేది, కాని దేని మీద వ్యామోహం ఉండేది కాదు.

అందుచేత నువ్వు మోక్ష స్థితి పొందావు అంటే నీకున్న వ్యామోహాలన్నీ తొలగిపోవాలి. ఇది ఎలా వస్తుంది, ఎలా సాధ్యం అవుతుంది అంటే శంకరాచార్యుల వారు అద్భుతమైన శ్లోకం చెప్పారు, ఏమిటంటే ?

**సత్సంగత్వే నిస్సంగత్వం,**
**నిస్సంగత్వే నిర్మోహత్వం,**
**నిర్మోహత్వం నిశ్చల చిత్తం,**
**నిశ్చల చిత్తే జీవన్ ముక్తి!** అన్నారు, అదే మోక్షం

తా:- సత్ సంగం అంటే సత్యంతో అంటే ఆత్మతో సాంగత్యం వల్ల, అసత్యమైన ఈ జగత్తు పట్ల అసంగత్వం ఏర్పడుతుంది, అంటే సంఘం వదులుతుంది, అంటే వ్యామోహం పోతుంది, మమకారం పోతుంది. అలాంటి అసంగత్వం వల్ల మోహ భ్రాంతి అంటే వ్యామోహం తొలగిపోతుంది. ఆ మోహం నశించగానే చిత్తం అంటే మనసు నిశ్చలం అవుతుంది. అలాంటి నిశ్చలమైన మనసు వల్లనే జీవన్ ముక్తి లభిస్తుంది, అంటే మోక్షం పొందగలుగుతారు అంటే దుఃఖం నుంచి శాశ్వతంగా బయట పడడం

జరుగుతుంది. అలాంటి శాశ్వత దుఃఖ రాహిత్యమే మోక్షం అని శ్రీ ఆదిశంకరాచార్యులు వారు చెప్పడం జరిగింది.

మరి సత్సంగం అంటే అంతరంలో ఉన్న ఆత్మతో సాంగత్యం ఎలా సాధ్యమవుతుంది అంటే అది పత్రి గారు బోధించినటువంటి "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేయడం వల్లనే సాధ్యం. అందుచేత ఈ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేయండి, దుఃఖం నుంచి శాశ్వతంగా బయట పడండి అంటే మోక్షాన్ని పొందండి.

ఇంకా గైడింగ్లు, మ్యూజిక్లు వీటి వల్ల ఏమి సాధ్యం కావు, అసలు సత్యంతో సాంగత్యమే ఏర్పడదు. మ్యూజిక్ పెట్టుకుంటే అసత్యమైన మనసు తోటే సాంగత్యం అవుతుంది, అంతేకాని సత్యమైన ఆత్మతో సాంగత్యం ఏర్పడదు, మీరు మోక్షాన్ని పొందలేరు.

ఇది బాగా అర్థమైతే మీరు భీమవరం రావటం మానరు, ఎంత కష్టమైనా వచ్చి తీరుతారు. అంత అద్భుతమైన అవకాశం ఉంటే దాన్ని ఉపయోగించుకోకపోతే కచ్చితంగా మీ కంటే మూర్ఖుడు ఎవరూ లేరని చెప్పొచ్చు.



# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 11) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 12) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 13) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 14) పంచకోశాలు | - | రూ.60/- |
| 15) మనస్సు యొక్క స్థితులు | - | రూ.60/- |
| 16) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 17) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 18) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 19) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 20) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|

# Tatavarthy Raghavarao Sir Books in English

| | | |
|---|---|---|
| 1. | Life Science (Part-I) | Rs.120 |
| 2. | Why is Guiding Not Meditation ? | Rs.100 |
| 3. | Which is the right meditation ? | Rs.100 |
| 4. | Die before death! | Rs.120 |
| 5. | The Law of Karma | Rs.100 |
| 6. | Losses caused by Desires | Rs.100 |
| 7. | Benefits of knowing what happens after death | Rs.100 |
| 8. | What is Meditation? | Rs.80 |
| 9. | True Path | Rs.80 |
| 10. | Why soul-knowledge ? | Rs.70 |
| 11. | What comes after death ? | Rs.70 |
| 12. | Learnings through the male and female births | Rs.70 |
| 13. | Who are Soul-murderes? | Rs.70 |
| 14. | How to improve Financial Status ? | Rs.60 |
| 15. | Wisdom is attained only through Meditation | Rs.60 |
| 16. | Knowledge of Brahman (Brahma-Jnan) | Rs.60 |
| 17. | What is Intention? | Rs.50 |
| 18. | Why is this life? | Rs.50 |
| 19. | Shankaracharya's Jagrata panchakam | Rs.50 |
| 20. | Vegetarian Food Is Human Food | Rs.50 |
| 21. | Brahman means? | Rs.50 |
| 22. | How to become a master? | Rs.50 |
| 23. | How to become a champion ? | Rs.50 |
| 24. | Truth | Rs.50 |
| 25. | Meditation for the Development of Students | Rs.40 |
| 26. | Non violence and vegetarianism | Rs.40 |

| | |
|---|---|
| REBIRTH (Tatavarthy Rajya Lakshmi) | Rs.150 |
| What is Ignorance (Avidya) ? | Rs.70 |

## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**



# श्री तटवर्ती वीर राघवराव के हिन्दी किताब

1. आत्म शास्त्र ।................................................ Rs.200/-
2. ध्यान विद्या ।................................................ Rs.160/-
3. भगवद गीता का सार ।........................................ Rs.160/-
4. सत्य मार्ग ।................................................... Rs.160/-
5. मरने से पहले मरना है।...................................... Rs.130/-
6. गाईडिंग ध्यान क्यों नहीं ?.................................. Rs.120/-
7. भगवान कौन है।.............................................. Rs.120/-
8. कर्म सिद्धांत ।................................................ Rs.120/-
9. विज्ञान का अर्थ - निहितार्थ ।............................... Rs.120/-
10. ब्रह्म ज्ञान ।................................................. Rs.100/-
11. यह जीवन क्यों है ? ......................................... Rs.100/-
12. मेहर बाबा का संदेश ।........................................ Rs.100/-
13. कौन सा ध्यान सही है ?...................................... Rs.100/-
14. इच्छाओं के कारण होने वाली हानियाँ....................... Rs.100/-
15. शंकराचार्य जी का ज्ञान संदेश................................ Rs.100/-
16. कठोपनिषद् ..................................................... Rs.100/-
17. मरने के बाद, साथ में आने वाले विषयों ।.................Rs.80/-
18. भगवत के दृश्यों का अर्थ ।....................................Rs.80/-
19. आत्म हंतक कौन होता है ।....................................Rs.70/-
20. स्त्री जन्मों में सीखने वाले विषयों, पुरुष जन्मों में सीखने वाले विषयों।. Rs.70/-
21. दुख निवारण का मार्ग..........................................Rs.75/-
22. उत्तम पुरूष.......................................................Rs.60/-
23. आर्थिक स्थिति बढाना है तो ? ................................Rs.60/-
24. निर्वाण मार्ग......................................................Rs.60/-
25. सत्य................................................................Rs.50/-
26. क्या हम इस लोक के वासी हैं या परलोक के वासी हैं ? .......... Rs.50/-
27. गुरू को पहचानना कैसे ?.......................................Rs.50/-
28. विद्यार्थियों के विकास के लिए ध्यान विद्या .................Rs.50/-
29. शाकाहार ही मानव का आहार है! ..............................Rs.50/-
30. ब्रह्मं क्या है ? ..................................................Rs.50/-
31. शंकराचार्य जी का जाग्रत पंचक ..............................Rs.50/-
32. शंकराचार्य जी का निर्वाण शट्कम ...........................Rs.50/-
33. चैंपियन बनना हो तो ? ..........................................Rs.50/-
34. तीन प्रकार के जीवन............................................Rs.50/-
35. संकल्प अर्थात ?..................................................Rs.40/-

# పత్రీజీ 

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించకముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం- రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) గీతాసందేశం - రూ.120/-
12) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన
మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం?- రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు-రూ.90/-
23) కర్మ సిద్ధాంతం - రూ.80/-
24) ధ్యానమంటే ? - రూ.80/-
25) త్రివిధాలు - రూ.80/-
26) ఉత్తమ పురుషుడు - రూ.80/-
27) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
28) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
29) జ్ఞాన జ్యోతి - రూ.70/-
30) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
31) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
32) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
34) బుద్ధుని సందేశాలు - రూ.70/-
35) భూతదయే దైవత్వం - రూ.70/-
36) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
38) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
39) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
40) మానవునిలోని చెడు -రూ.70/-
41) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
42) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
43) మోక్షం అంటే? - రూ.70/-
44) కబీరు సందేశాలు-1 -రూ.70/-
45) కబీరు సందేశాలు-2 -రూ.60/-
46) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
47) బ్రహ్మాజ్ఞానం - రూ.60/-
48) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
49) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
50) అతీంద్రియ శక్తులు - రూ.60/-
51) ఆలోచించండి - రూ.60/-
52) నిర్వాణ మార్గం - రూ.60/-
53) ధ్యానులకు సూచనలు - రూ.60/-
54) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
55) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/-
56) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/-
57) మాస్టర్‌గా ఎదగాలంటే? -రూ.50/-
58) భగవంతుని ఇష్టులవ్వాలంటే-రూ.50/-
59) సంకల్పమంటే? - రూ.50/-
60) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
61) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
62) మూడురకాల భవిష్యత్తులు -రూ.50/-
63) అరిహంత్ - రూ.50/-
64) మూడురకాల జీవితాలు -రూ.40/-
65) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
66) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
67) బ్రహ్మం అంటే? -రూ.40/-
68) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం -రూ.40/-
69) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
70) మహాత్ముల సందేశాలు - రూ.40/-
71) సత్యం - రూ.40/-
72) చక్రాలు - రూ.40/-
73) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
74) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
75) మౌన ధ్యానం - రూ.40/-
76) విదురుని సందేశాలు - రూ.40/-
77) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
78) శాకాహారమే మానవాహారం - రూ.15/-
79) అహింస మరియు శాఖాహారం- రూ.15/-



మోక్షమంటే ఏమిటి? మోక్షాన్ని సంపాదిస్తే వచ్చే లాభం ఏమిటి? అసలు మోక్షం ఎలా వస్తుంది? నిజంగా మోక్షమంటే సరైన అవగాహన కలిగి ఉంటే మీరు ప్రతిరోజు ధ్యానం చేయడం మానరు,

మానవుడు ఈ భూమ్మీద కొన్ని జన్మలు తీసుకునే సరికి ఇక్కడ పడే బాధలు, దుఃఖం, ఇక్కడ ఉండే సమస్యలు, ఇక్కడ ఉండే గొడవలు అన్నీ అనుభవించి ఇందులో నుంచి ఎలా అయినా బయటపడాలి? అంటే ఎలా విడుదల అవ్వాలి? అని అనుకుంటాడు. ఈ భూమ్మీద కర్మలు అనుభవించే మానవుడు ఈ బంధాల నుంచి విముక్తుడు అవ్వాలని అనుకుంటాడు.

మోక్షమంటే బంధాలనుండి విడుదల, దుఃఖ భూయిష్టమైన సంసార బంధం నుండి విముక్తి పొందటమే మోక్షము.

రూ.70/-

- బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|